


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

09.09.2026
బుధవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 119
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## అసత్యాలపై సత్యమే గెలుస్తుంది

- నరేంద్ర మోదీ
- యువతే దేశ భవిష్యత్తు: మోదీ
- విపక్షాల అబద్ధాలపై విమర్శలు
- రాహుల్ ఛాంత్రో కీ గూంజ్‌పై చురకలు
- ఫ్రైట్ కారిడార్‌పై కాంగ్రెస్‌ను టార్గెట్
- ఏఐ నైపుణ్యాలు పెంచుకోవాలని పిలుపు



06లో..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్

అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోంది ని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

## సోషల్ మీడియాపై సీరియస్‌గా ఉండాలి



- మంత్రి నారా లోకేష్
- ప్రభుత్వ పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వాస్తవాలను సోషల్ మీడియాలో చెప్పాలి
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- పార్టీ కార్యక్రమాలపై టీమ్స్ యాక్టివ్‌గా ఉండాలి
- అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలి

2లో..

# అభివృద్ధితో ఓటు బ్యాంక్ పెంచుకుందాం

- సీఎం చంద్రబాబు నాయుడు
- ఓటు వేయని వారినీ మార్చాలి
- నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్
- జీఎస్డీపీ పెంపే లక్ష్యంగా ముందుకు
- రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు
- 1,400 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం
- డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు
- స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యం
- అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్త: చంద్రబాబు



అమరావతి, సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్

అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం.. ఓటు వేయని వారినీ మార్చుకుందాం అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో 2వ రోజు సుస్థిర అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని సూచించారు. 2026-27లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని, 15-20 రంగాల్లో అభివృద్ధి ద్వారా జీఎస్డీపీని మరింత పెంచాలన్నారు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని, నీటి లభ్యత సమస్య కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి గెలవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

2లో..

## ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం ఎగుమతులు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతిపాదనపై సానుకూలంగా లారెల్

వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై.. ఇరువురు నేతలు చర్చించారు

2లో..



హైదరాబాద్, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరువురు నేతలు చర్చించారు. భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా అవతరించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, అవసరమైన అనుభవం తెలంగాణకు ఉన్నాయని తెలిపారు.

## శాసనసభలో విషాదం

- నవీన్ మిట్టల్ దగ్గర పర్సనల్ సెక్రటరీ మృతి
- సడెన్‌గా కుప్పకూలిన రాజు
- సీపీఆర్ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి
- హాస్పిటల్‌కు తరలించే సమయంలో మృతి



2లో..

హైదరాబాద్, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఇవాళ చోటు చేసుకున్న ఓ అత్యంత విషాదకర ఘటన అసెంబ్లీ వర్గాలను, అధికారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ దగ్గర పర్సనల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న రాజు శాసనసభ ఆవరణలోనే అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు.

## హాస్టళ్ల భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- 'మా మనసులో ఒక ఆలోచన ఉంది' 2లో..
- దేశవ్యాప్తంగా సేఫ్టీ ఆడిట్లకు ఆదేశాలు?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్

దేశ రాజధాని ఢిల్లీలోని సత్య నికేతన్‌లో పీజీ హాస్టల్ భవనం కూలి విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాసుల కక్కుర్తితో కొందరు యజమానులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇష్టానుసారంగా భవంతులు నిర్మించి ప్రాణాలు తీస్తున్నారు. ఢిల్లీ ఘటనలో ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది.

## కామన్ ఫెసిలిటీ సెంటర్లు

- హస్తకళాకారుల అభివృద్ధికి ఏర్పాటు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు
- వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

2లో..



అమరావతి, సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్

హస్తకళాకారుల అభివృద్ధికి కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం సీతంపేటలో సవర కళాకారుల సెంటర్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.వీబీజీ రామ్ జీ నిధులతో సవర కళాకారుల సెంటర్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

## కిలో ఉల్లిపాయలు రూ.32కే..

- వచ్చే వారం నుంచే అందుబాటులోకి
- మంత్రి నాదెండ్ల మనోహర్
- ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

2లో..

అమరావతి, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏపీలో కిలో ఉల్లిపాయలు రూ.32కే సర్కార్ అందించనున్నట్లు తెలిపారు. వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో ఉల్లిపాయలను విక్రయించనున్నట్లు చెప్పారు. మొబైల్ కౌంటర్ల ద్వారా కూడా ఉల్లిపాయలు సరఫరా చేస్తామన్నారు. రేషన్‌తో కిలో కందిపప్పును సబ్సిడీపై ప్రభుత్వం అందించనుందని తెలిపారు. మార్కెట్ ధర కంటే 2530శాతం తక్కువకు కందిపప్పు విక్రయిస్తామన్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కంది సేకరణకు కేంద్రం సహకారం అందించనున్నట్లు వెల్లడించారు.

## అర్హతలు లేని వారిని తొలగించాలి

- టెట్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టాల అమలుకు ఆదేశం



2లో..

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండిస్తూ
- తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
- అసెంబ్లీ, మండలి తీరుపై సంజయ్ ఫైర్

2లో..





# కామన్ ఫెసిలిటీ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

మదనపల్లి, అనంతపురం, పెడనల్లో సెంటర్ల కోసం స్థలాల గుర్తింపు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. త్వరలో మదనపల్లి, అనంతపురం, పెడనల్లో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్ అభివృద్ధికి రూ.12 లక్షలు కేటాయించినట్లు పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఏటికొప్పాక ఆరోగ్య కేంద్రం పనులు పునఃప్రారంభిస్తామని చెప్పారు. హస్తకళాకారుల సంక్షేమానికి మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించామని అన్నారు. హస్తకళా ఉత్పత్తులపై క్యూఆర్ కోడ్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశామని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కళాకారుడి వివరాలు, శ్రమకు సంబంధించిన సమాచారం అందిస్తామని అన్నారు.

హస్తకళలను గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించేలా చర్యలు చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరు ఉచిత నేత్ర వైద్య శిబిరాల్లో 1,708 మందికి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. సుమారు 93 మందికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. 1,253 మందికి పైగా ఉచిత కళ్లద్దాల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అన్నారు. హస్తకళాకారులు పస్తులు ఉండకూడదని.. పనికి ఆటంకం కలగకూడదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# హాస్టళ్ల భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా ఈ వ్యవహారంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు నివసించే పీజీలు, ప్రైవేట్ హాస్టళ్లు, స్టూడెంట్ అకామడేషన్ల భద్రతపై విస్తృత స్థాయిలో ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలించనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం సంకేతాలు ఇచ్చింది. ఈ కేసును సెప్టెంబర్ 10న విచారించనున్నట్లు తెలిపింది. మంగళవారం జరిగిన విచారణలో.. ఢిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా విద్యార్థుల వసతి గృహాల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా పరిధిలోకి తీసుకురావచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది.

**సత్య నికేతన్ ఘటనపై విచారణ**

ప్రస్తుతం అక్రమ నిర్మాణాలకు సంబంధించిన కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది. ఈ కేసులో కోర్టు నియమించిన అమికస్ క్యూరీ అజిత్ కుమార్ సిన్హా.. ఢిల్లీలోని ప్రైవేట్ హాస్టళ్లు, పీజీ అకామడేషన్లపై సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. సత్య నికేతన్ ఘటన విద్యార్థుల వసతి భద్రతపై ఉన్న విస్తృత సమస్యలను బయటపెట్టిందని ఆయన తెలిపారు. చాలా పీజీలు, ప్రైవేట్ హాస్టళ్లు నివాస భవనాల్లోనే నిర్వహిస్తున్నారని.. వాటిలో నిర్మాణపరమైన మార్పులు, భవనం వినియోగంలో మార్పులు లేదా అనుమతి లేని నిర్మాణాలు జరిగే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**'దేశవ్యాప్తంగా ఆదేశాలు ఇస్తాం'**

ఢిల్లీ పరిపాలన తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. సత్య నికేతన్ భవనం కూలిన ఘటనను "భయానక ఘటన"గా అభివర్ణించారు. ఈ ఘటనపై ఢిల్లీ హైకోర్టు ఇప్పటికే ఎంసీడీ అధికారుల పాత్రపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిందని తెలిపారు. అలాగే ఢిల్లీలోని పీజీలపై నగరవ్యాప్తంగా భద్రతా ఆడిట్ నిర్వహించాలని కూడా హైకోర్టు ఆదేశించిందని వివరించారు. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని తుషార్ మెహతా సూచించారు.

# శాసనసభలో విషాదం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ప్రాంగణంలో రాజు ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోవడాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించారు. అప్పటికప్పుడు రాజుకు కార్డియోపల్మనరీ రిససిటేషన్ చేస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ రాజు ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో, వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే, మార్గమధ్యలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజు అకస్మాత్తుగా గుండెపోటు కు గురికావడమే ఈ మృతికి కారణమని తెలుస్తోంది. ఈ హఠాత్పరిణామం అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న వారందరినీ ఆందోళనకు గురిచేసింది.

# అభివృద్ధితో ఓటు బ్యాంక్ పెంచుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

కొందరు దింపుడు కళ్లెం ఆశతో 'సర్' పైనా, రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లారని విమర్శించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ నేతలకు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మేయర్లు, చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని నిర్ణయించామని అన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలనే ఈ ప్రక్రియ చేపట్టామని వెల్లడించారు. బెస్ట్ అభ్యర్థులను నిలిపేలా ప్రతి ఒక్కరం జాగ్రత్త పడాలని సూచించారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం లేకుండా చూడాలని నిర్దేశించారు.

పార్టీకి ప్రభుత్వానికి చెడ్డపేరు లేకుండా అభ్యర్థుల ఎంపిక జరగాలని ఆదేశించారు. ఆయా కమిటీల ద్వారా ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ముందుకెళ్దామని సూచించారు. గెలుపే ధ్యేయంగా పనిచేయటంతో పాటు కూటమిగా బ్యాలెన్సింగ్ జరగాలని మార్గనిర్దేశం చేశారు. విశాఖపట్నం నార్త్ మినహా నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించామని తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలోని నాయకులు పనిచేయాలని ఆదేశించారు. పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే సస్పెన్షన్ వేటు పడుతుందని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మనం అంతా స్ఫూర్తితో కలసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిద్దామని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



# సోషల్ మీడియాపై సీరియస్‌గా ఉండాలి

**మంగళగిరి, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్**

తమ పార్టీ నేతలు సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దని... ఈ విషయంపై సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. ఈరోజు (మంగళవారం) మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండో రోజు లీడర్ షిప్ కాంక్లేవ్‌లో పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్ అంశంపై లోకేశ్ మాట్లాడారు. ఎంతమంది నాయకులు సోషల్ మీడియాను యాక్టివ్‌గా వినియోగిస్తున్నారని అడిగారు.

**డీఎస్సీపై సెల్ఫీ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశా..**

ఏఎంసీ, కార్పొరేషన్ చైర్మన్లు కూడా తాము చేసిన పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని, ఓపెన్‌గా మాట్లాడాలని దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సోషల్ మీడియా ద్వారా సెల్ఫీ వీడియోలతో తన సందేశాన్ని తెలియజేస్తున్నారని అన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేశానని, డీఎస్సీపై దుష్ప్రచారంపై సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశానని తెలిపారు.

**ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలి..**

ఈ విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని లోకేశ్ సూచించారు. వైసీపీ పని ఎప్పుడూ తమ ప్రభుత్వంపై బురదజల్లడమేనని విమర్శించారు. జగన్ అండ్ కో దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదిక ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఆదేశించారు. పార్టీ ఆదేశాలు, కార్యక్రమాలపై సోషల్ మీడియా టీమ్స్ ఎప్పటికప్పుడు స్పందించాలని మార్గనిర్దేశం చేశారు. జగన్ మావిగన్ అంటే వైసీపీ నేతలు, కార్యకర్తలు గుడ్డిగా సమర్థిస్తున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో తాము అభివృద్ధి చేస్తున్నామని... మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం ఎగుమతులు

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత ఎక్కువ మొత్తంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపై చర్చించారు.

ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీ ధరలు, నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు, శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా ఇరువురు చర్చించారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా కార్యదర్శి లారెల్ ఆసక్తి వ్యక్తం చేశారు. దీనిని స్వాగతించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో తెలంగాణకు బలమైన సామర్థ్యం ఉందన్నారు. ఎగుమతికి అనువైన ఉత్పత్తులు, నాణ్యతా ప్రమాణాలు, అనుమతులు, ఇతర నియంత్రణ నిబంధనలను సంబంధిత ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తామని తెలిపారు.

అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశాలు కల్పించడం వల్ల రైతులు, రైస్ మిల్లర్లు, విత్తన కంపెనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని ఇతర వర్గాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి చెప్పారు. 'తెలంగాణ రైతులు, వ్యవసాయ పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడమే మా లక్ష్యం. ఫిలిప్పీన్స్‌కు బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘకాలంపాటు విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయి.' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భారత్‌ఫిలిప్పీన్స్ సంబంధాలు, ఆహార భద్రత, వ్యవసాయ సహకారం, తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు ప్రత్యక్ష వాణిజ్యాన్ని పెంచే అవకాశాలపై కూడా ఇరువురు విస్తృతంగా చర్చించారు. భారత్‌ఫిలిప్పీన్స్ మధ్య అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో వ్యవసాయం, ఆహార వాణిజ్యం కీలక పాత్ర పోషించగలవని అభిప్రాయపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి లారెల్ తమ తమ ప్రాంతాలను సందర్శించాల్సిందిగా పరస్పరం ఆహ్వానించుకున్నారు. 2026 డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ రావాల్సిందిగా లారెల్‌కు ఉత్తమ్ ప్రత్యేక ఆహ్వానం అందించారు.

# కిలో ఉల్లిపాయలు రూ.32కే..

(మొదటి పేజీ తరువాయి)



నాలుగు నుంచి ఐదు నెలల పాటు కందిపప్పును పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పామాయిల్ ధరల నియంత్రణకూ కేంద్రంతో చర్చలు జరుపుతామని చెప్పారు. పీడీఎస్ బియ్యంలో 25శాతం నూకల స్థానంలో 10శాతం నూకలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏపీ పైలట్‌ను కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయనుందన్నారు. అక్టోబర్ 1 నాటికి వెయ్యి 'మీ మార్ట్' దుకాణాలు ప్రారంభిస్తామని.. ఇప్పటికే 870 'మీ మార్ట్' దుకాణాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 64 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు మీ మార్ట్ దుకాణాల ద్వారా అమ్మకాలు చేయనున్నట్లు తెలిపారు. 100, 250, 500 గ్రాముల చిన్న ప్యాకెట్లలో సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు.

రైతులకు 24 గంటల్లోనే ధాన్యం చెల్లింపులు కొనసాగుతాయని నాదెండ్ల వెల్లడించారు. 3738 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉందన్నారు. పీడీఎస్‌లో పంచదార, పచ్చిశనగల పంపిణీ యథావిధి కొనసాగుతుందన్నారు. త్వరలో రేషన్‌తో పామాయిల్ సరఫరా చేయడమే లక్ష్యమని తెలిపారు. ఎల్‌పీజీ రీబుకింగ్‌కు 25 రోజుల గ్యాప్ అమల్లోకి రానుందన్నారు. విజయసాయి రాజకీయ పార్టీని మంత్రి స్వాగతించారు. ఎవరైనా పార్టీ పెట్టొచ్చన్నారు. విజయసాయిరెడ్డి రాజకీయ ప్రవేశానికి స్వాగతం పలికారు. కాగా.. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు.

# అర్హతలు లేని వారిని తొలగించాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**



టీచర్ నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయుల నియామకాలు, ఉద్యోగంలో కొనసాగింపుపై సంచలన ఆదేశాలు ఇచ్చింది. ఇకపై ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీచట్టాల ప్రకారం నిర్దేశించిన అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించకూడదని.. అలాగే ఉద్యోగంలో కొనసాగించకూడదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఉపాధ్యాయులు, విద్యా సంస్థల ఉద్యోగుల ప్రొవిన్షియలైజేషన్‌కు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL)పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.

**అర్హతలు లేకుంటే టీచర్‌గా నియమించొద్దు**

ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా.. సంబంధిత చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. కింద నిర్దేశించిన అవసరమైన అర్హతలు కలిగి లేని వ్యక్తులను పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించకూడదని సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. అంటే ఇప్పటికే ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయుల విషయంలోనూ సంబంధిత చట్టాలు, నిబంధనల్లో పేర్కొన్న అర్హతలను పాటించాల్సి ఉంటుందని కోర్టు ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

**టీచర్ నియామకాలపై పిల్.. కోర్టు నోటీసులు**

విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులను ప్రొవిన్షియలైజేషన్ చేసే ప్రక్రియకు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ ఈ PIL దాఖలైంది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై వారు తమ స్పందనను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. దీనిపై తదుపరి విచారణలో మరిన్ని అంశాలను పరిశీలించనున్నట్లు కోర్టు తెలిపింది.

# బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభ, శాసన మండలి ప్రస్తుతం విమర్శలు, ప్రతివిమర్శలు, దాడులకు వేదికగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీ, మండలిలో ఇదేం రాజకీయం?

ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన చట్టసభలు రాజకీయ విమర్శలకు కేంద్రాలుగా మారడం సరికాదని బండి సంజయ్ అన్నారు. ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. సభల్లో వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు తావివ్వకూడదని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ వంటి కీలక పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి భాష ఉపయోగించడం నీచంగా, సిగ్గుచేటుగా ఉందని మండిపడ్డారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో పదవులకు గౌరవం ఇవ్వాలని అన్నారు.

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండిస్తూ..

మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషంగా ఉందని బండి సంజయ్ ఆరోపించారు. సీనియర్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు ఎదురైన ఘటనలను ఆయన ప్రస్తావించారు. ప్రజా ప్రతినిధులతో పోలీసులు వ్యవహరించే విధానం గౌరవప్రదంగా ఉండాలని అన్నారు. మహిళా ప్రజా ప్రతినిధులపై జరిగిన ఘటనలు, సభలో చోటుచేసుకున్న అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలకు, ప్రజాప్రతినిధులకు గౌరవం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# 7 లక్షల మంది వస్తున్నారు.. 30వేల మందికి మాత్రమే హాస్టల్లా?: సోనూసూద్



దిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఐదంతస్తుల భవనం కూలిన విషాద ఘటనపై నటుడు సోనూ సూద్ (Sonu Sood) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నగరాల్లో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

"ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి ఇంటిని వదిలి ఇతర నగరాలకు వెళ్తుంటారు. దిల్లీలో సుమారు 7 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటుంటే.. ఇక్కడి హాస్టళ్ల సామర్థ్యం కేవలం 30,000 మాత్రమేనా?. అంటే ప్రతి 31 మంది విద్యార్థులలో ఒక్కరికి మాత్రమే హాస్టల్ వసతి దక్కుతోంది. యూనివర్సిటీల పరిధిలోని ఖాళీ ప్రభుత్వ స్థలాలను గుర్తించి, విద్యార్థుల కోసం సురక్షితమైన హాస్టళ్లను అక్కడ ఎందుకు నిర్మించకూడదు?. క్యాంపస్‌లో మరిన్ని వసతి సౌకర్యాలను కల్పించడానికి విశ్వవిద్యాలయాల్లో అదనపు నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలి. దీనివల్ల విద్యార్థులకు భద్రతతో పాటు వారి తల్లిదండ్రులకు మనశ్శాంతి ఉంటుంది. అన్నింటి కంటే ముఖ్యంగా మనం విద్యార్థుల ప్రాణాలను కాపాడుకోగలుగుతాం. ఒక్కోసారి మనం అనుసరిస్తోన్న విధానాలలో చేసే చిన్న మార్పు కూడా ఒకరి జీవిత ఆశయాన్ని నిలబెడుతుంది" అని సోనూసూద్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు

దిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఐదంతస్తుల భవనం కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల సంఖ్య ఏడుకు చేరింది. హాస్టల్ భవన యజమానిని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఐదంతస్తుల భవనాలన్నింటినీ సీల్ చేయాలని ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆదేశించారు.

# మసీదు శిథిలాల కింద పురాతన బావి.. సహారన్‌పుర్‌లో మరో మందిర్ మసీదు వివాదం!



ఇక్కడి జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఉన్న మసీదును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొని కూల్చివేసిన నేపథ్యంలో శిథిలాలు తొలగిస్తుండగా బయటపడిన ఒక పురాతన బావిని ఆర్కియలాజికల్ సర్వే ఇండియా (ఏఎస్ఐ) బృందం పరిశీలిస్తోందని అధికారులు తెలిపారు. దాదాపు 20 అడుగుల లోతు, 1.5 మీటర్ల వెడల్పుతో ఇనుప షీట్లు కలిగి వున్న ఈ బావి ఎంత పాతది అన్న విషయంపై జోరుగా చర్చ సాగుతోంది. ఈ బావిని ఏఎస్ఐ బృందం పరిశీలించి దాని చారిత్రక నేపథ్యాన్ని నిర్ధారిస్తుంది అని సదర్ సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ సుబోధ్ కుమార్ తెలిపారు. ఏఎస్ఐ అధికారులు సోమవారం మధ్యాహ్నం ఘటనా స్థలాన్ని చేరుకున్నారని, స్థానిక ప్రభుత్వ అధికారుల సమక్షంలో తమ అధ్యయనం ప్రారంభించారని సుబోధ్ కుమార్ తెలిపారు. ఆ బావి పాత కాలంలో నమాజ్‌కు వచ్చే భక్తులు ప్రార్థనలకు పూర్వం ముఖం, కాళ్లు చేతులు కడుక్కునేందుకు ఉపయోగపడేదని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ అన్నారు. మసీదుకు పూర్వం ఈ స్థలంలో ఆలయం ఉండవచ్చని ఈ బావి సూచిస్తోందని బజ్రంగ్‌దళ్ మాజీ కన్వీనర్ వికాస్ త్యాగి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.





# విమానం కాదు.. ఆర్టీసీ బస్సే..! వీడియో వైరల్

బస్సులో ప్రయాణిస్తున్నామా.. లేక విమానంలో ఉన్నామా..? అనే సందేహం కలిగించేలా కేరళం ఆర్టీసీ ప్రీమియం బస్సులను అందుబాటులోకి తెచ్చింది. తిరువనంతపురంకొచ్చి మార్గంలో తిరిగే ఈ బస్సులో విమాన స్థాయి సౌకర్యాలు కల్పించారు. సకల సదుపాయాలతో కూడిన బస్సు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రయాణాన్ని హాయిగా మార్చేందుకు లెదర్ సీట్లు ఏర్పాటు చేశారు. వినోదం కోసం వ్యక్తిగత తెరలు, మొబైల్ ఛార్జింగ్ పోర్టులూ, ఉచిత వైఫై సౌకర్యం కల్పించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ బస్సులో హోస్టెస్ సేవలూ అందిస్తున్నారు. అల్పాహారంతోపాటు ఇతర ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. బాత్‌రూమ్ సౌకర్యమూ కల్పించారు. సాధారణంగా సుదీర్ఘ బస్సు ప్రయాణాల్లో ఎదురయ్యే అసౌకర్యాన్ని తగ్గించేలా ఈ సదుపాయం ఉపయోగపడనుంది. ఈ ఏర్పాట్లు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇక టికెట్ ధర విషయానికొస్తే, తిరువనంతపురంలో ప్రారంభమయ్యే ఈ బస్సు చివరకు ఎర్నాకులం చేరుకుంటుంది. సుమారు 200+ కి.మీ. ప్రయాణానికి రూ.505గా టికెట్ ధరను కేఎస్ ఆర్టీసీ నిర్ణయించింది.

# వారి వివాదంలో నటిని నిందించారు.. త్రిషకు కంగనా మద్దతు

రాజకీయ వివాదాల్లో మహిళల వ్యక్తిత్వాన్ని నిందించడం అలవాటుగా మారిందంటూ నటి, ఎంపీ కంగనా రనౌత్ మండిపడ్డారు. తమిళనాడులో నటి త్రిషపై ఇటీవల ఉదయనిధి చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో కంగనా స్పందించారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు.

''తమిళనాడులో ఏం జరిగిందో అందరం చూశాం. రెండు రాజకీయ పార్టీల వివాదంలోకి ఒక గౌరవప్రద నటిని తీసుకొచ్చినిందలేశారు. ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారు. వేధింపులు, వ్యక్తిగత విషయాలకు సంబంధించిన ఘటనల్లో ఎప్పుడూ మహిళలే లక్ష్యంగా మారుతున్నారు. కేవలం భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఇదే జరుగుతోంది. ఒక మహిళ ఉద్యోగం చేస్తున్నా, విజయం సాధించినా, నాయకురాలిగా అధికారంలో ఉన్నా.. ఆమె వ్యక్తిత్వంపై దాడి చేసి దిగజార్చాలని చూస్తున్నారు'' అని కంగనా అన్నారు. మహిళలపై జరిగే ఈ రకమైన దాడులు ఎప్పుడు ఆగుతాయని ఆమె ప్రశ్నించారు. మహిళలను మనం ఎలా చూస్తున్నాం, వారిని నిజంగా గౌరవిస్తున్నామా లేదా అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

మరోవైపు మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే చట్టం చూస్తూ ఊరుకోదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తాజాగా హెచ్చరించారు. భావప్రకటనా స్వేచ్ఛను ఎలా ఉపయోగించుకుంటున్నామో ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు.





# విద్యార్థుల కోసం 5 లక్షల సిమ్‌కార్డులు

ద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా వారంతా నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం 5లక్షల సిమ్ కార్డులకొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ఈలెర్నింగ్‌లో భాగంగా ఈ ఏడాది 10 నుంచి 12 తరగతి చదివే విద్యార్థుల్లో 5లక్షల మందికి ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు సిమ్ కార్డులు కొనుగోలు చేయాలని తాజాగా నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్‌తోపాటు ఇతర విద్యా సంబంధిత సోర్సుల నుంచి కొత్త నైపుణ్యాలను నేర్చుకునే వీలుంటుందని హరియాణా ప్రభుత్వం భావిస్తోంది.

# మైనర్‌పై అత్యాచారం.. నిందితుడికి మరణశిక్ష

తమిళనాడులోని తిరునెల్వేలిలో ఓ మైనర్‌పై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ కేసులో ఒక నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే..

తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాధితురాలికి 2022లో పెయింటర్‌గా పనిచేసే 25 ఏళ్ల మునీశ్వరన్ పరిచయమయ్యాడు. రెండు వారాల పాటు వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పెళ్లిచేసుకుంటానని నమ్మించి మునీశ్వరన్ ఆ బాలికను మీనాక్షిపురం తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులు చిన్నకుట్టి, మురుగేశన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు.

అనంతరం ఈ విషయాన్ని బాధితురాలు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం.. మంగళవారం తీర్పు వెలువరించింది. చిన్నకుట్టికి మరణశిక్ష విధించిన కోర్టు.. మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల జైలు శిక్ష విధించింది.



# స్క్రాప్‌తో.. కాలఖండాలు!



పాడైపోయిన బైక్ విడిభాగాలు చాలామందికి పనికిరాని ఇనుప ముక్కలు.. జితేంద్ర పత్రాకు మాత్రం అవి అతడి సృజనకు ముడిసరుకులు. గ్యారేజీల్లో మూలనపడిన చైన్లు, స్ప్రాకెట్లు, రిమ్‌లకు కొత్త రూపమిస్తూ.. వాటిని అందమైన గడియారాలు, దీపాలుగా తీర్చిదిద్దుతున్నాడు భువనేశ్వర్‌లోని గడకణకు చెందిన జితేంద్ర. తను ఐటీఐ చదివి, ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఖాళీగా ఉన్నప్పుడు పాత విడిభాగాలతో ప్రత్యేకమైన గడియారాలు తయారు చేయడం అతడి హాబీ. కొన్ని బైక్ విడిభాగాల అసలు రూపాన్ని అలాగే ఉంచి, మరికొన్నింటిని పాలిష్ చేసి, వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా కొత్త రూపాన్ని ఇస్తాడు. బెడ్‌రూమ్ దీపాలు, సైడ్ టేబుళ్లు వంటి ఇతర వస్తువులను కూడా తయారు చేస్తున్నాడు. పాత బైక్‌తో భావోద్వేగ అనుబంధం ఉన్నవారి కోసం అదే బైక్‌కు చెందిన విడిభాగాలతో గడియారం రూపొందిస్తాడు. ధరలు రూ.2వేల నుంచి ప్రారంభమవుతాయి. డిజైన్, ఉపయోగించే విడిభాగాలు, కస్టమైజేషన్ ఆధారంగా రేట్ మారుతుంది. ముంబయి, దిల్లీ, కోల్‌కతా, కేరళం నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. జితేంద్ర మలిచిన ఓ గడియారం బాలీవుడ్ నటుడు, బైక్‌లంటే ఎంతో ఇష్టపడే జాన్ అబ్రహాంకి తెగ నచ్చేసింది. దానితోపాటే ఏకంగా మరో ఏడింటికి హీరో ఆర్డర్ చేశారని జితేంద్ర తెలిపాడు.

# మాదకద్రవ్య కేసులు పెరగడంపై సుప్రీంకోర్టు ఆందోళన



దేశంలో మాదకద్రవ్య రవాణా కేసులు అధికంకావడంపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. మాదక ద్రవ్యాల రవాణా నిరోధక చట్టం కింద వీటిపై సత్వర విచారణ జరిపేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం సూచించింది. భారీ సంఖ్యలో ఉన్న ఈ కేసుల విచారణకు మొత్తం 449 ప్రత్యేక కోర్టులు అవసరమవుతాయని, ఇప్పటికే 176 న్యాయస్థానాలు పనిచేస్తున్నాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి తెలిపారు. అవసరమైనన్ని ప్రత్యేక కోర్టులు సత్వరమే ఏర్పాటయ్యేలా చూడాలని, తగిన సదుపాయాలు కల్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నమోదు చేసే ప్రతి 1015 ఉగ్రవాద సంబంధిత కేసుల సత్వర విచారణకు ఒక ప్రత్యేక న్యాయస్థానం ఉండాలని మే 8నాటి ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ విషయమై అదనపు సొలిసిటర్ జనరల్ సమాధానమిస్తూ...కొత్తగా ఏర్పాటైన 8 ఎన్ఐఏ కోర్టులతో కలిపి వీటి సంఖ్య 22కు చేరిందని వెల్లడించారు.

# దొంగల భయంతో.. ఇల్లెక్కిన కారు



కొత్త కారును దొంగల నుంచి రక్షించుకునేందుకు బిహార్‌లో ఓ కుటుంబం వినూత్నంగా ఆలోచించింది. కారును క్రేన్ సహాయంతో ఏకంగా ఇంటి పైకప్పుపైకి చేర్చింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గోపాల్‌గంజ్‌కు చెందిన మనోజ్ యాదవ్ ఇటీవలే ఎస్‌యూవీ కారును కొనుగోలు చేశాడు. ఆయన ఇజ్రాయెల్‌లో పని చేస్తున్న కారణంగా జాగ్రత్తగా చూసుకోవాలంటూ కారును డ్రైవర్‌కు అప్పగించాడు. డ్రైవర్ వెళ్లిపోవడంతో కారు భద్రతపై ఆందోళన మొదలైంది. దొంగల బారి నుంచి కాపాడుకునేందుకు కారును ఇంటి రెండో అంతస్తులోని పైకప్పుపైకి తరలించాలని యాదవ్ కుటుంబం నిర్ణయం తీసుకుంది. అనుకుందే తడవు క్రేన్ సాయంతో కారును సురక్షితంగా ఇంటిపైకి ఎక్కించింది.

# నలుగురిని పొట్టన పెట్టుకున్న పులి.. ఎట్టకేలకు బంధించిన అధికారులు

మహారాష్ట్రలోని అమరావతి, వర్ధా జిల్లాల్లో నలుగురిని పొట్టనపెట్టుకున్న పులిని అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు బంధించారు. సోమవారం షిర్‌జ్‌గావ్ కస్బా ప్రాంతంలో ప్రత్యేక బృందం తీవ్రంగా శ్రమించి పులికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పట్టుకుంది. గత 20 రోజులుగా ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పశువులు, మనుషులపై పులి దాడులు చేస్తోంది. దీంతో ప్రజలు బయటకు రావాలంటే వణికిపోయారు. సెప్టెంబరు 6న 24 గంటల వ్యవధిలో పులి దాడిలో ఇద్దరు మృతిచెందడంతో అధికారులు అప్రమత్తమై గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

పులి కదలికలను గుర్తించేందుకు కెమెరా ట్రాప్స్, థర్మల్ డ్రోన్లు, ఇతర సాంకేతిక పరికరాలు వినియోగించారు. పులి దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అటవీశాఖ అధికారులు ఆర్థిక సాయం అందించారు. మొత్తం నలుగురు మృతి చెందగా.. పశువులు తీవ్రంగా గాయపడ్డట్లు అధికారులు వెల్లడించారు.





# సమష్టి ప్రగతికి హరిత సేతువు

కిర్గిస్థాన్‌లో తాజాగా జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సు 2026-30 మధ్య కాలానికి 'హరిత సాంకేతికతల కారిడార్'ను ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. హరిత ఇంధన వినియోగం, వాతావరణ మార్పుల నిరోధం, సుస్థిరాభివృద్ధి సాధన దిశగా ఎస్‌సీవో సభ్య దేశాల నడుమ శాస్త్ర, సాంకేతిక సహకార వృద్ధికి ఇది తోడ్పడుతుంది. ఈ ఒడంబడికతో భారత్‌కూ అనేక అవకాశాలు అందిరానున్నాయి.

ప్రపంచ వాతావరణ సంస్థ తాజా నివేదిక, 2015-25 మధ్యకాలంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. నిరంతరం మంచు కరిగిపోతూ ఉత్పాతాలకు దారితీస్తోందనీ, మున్ముందు మరిన్ని విధ్వంసకర వాతావరణ వైపరీత్యాలు సంభవిస్తాయనీ హెచ్చరించింది. ఈ క్రమంలోనే కిర్గిస్థాన్ సైన్స్, నవకల్పనల మంత్రి గుల్జాత్ ఇసమటోవా అధ్యక్షతన మొన్న మేలో షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సభ్య దేశాల శాస్త్ర సాంకేతిక మంత్రుల భేటీ జరిగింది. ఆసియా-ఐరోపా(యూరేసియా) ప్రాంతంలో గ్రీన్ టెక్నాలజీ కారిడార్ ఏర్పాటు చేయాలని వారంతా తీర్మానించారు. ఎస్‌సీవో దేశాలు హరిత సాంకేతికతలకు మారడం సుస్థిర అభివృద్ధికీ, పర్యావరణ భద్రతకూ పూచీ ఇవ్వగలదని ఇసమటోవా వ్యాఖ్యానించారు.

**సాంకేతికతలపై పెట్టుబడులు**

ఇంతకాలం కర్బన ఉద్గారాల తగ్గింపు, నిధుల కేటాయింపు, ఆర్థిక భారాన్ని పంచుకోవడంపైనే వాతావరణ చర్చలు దృష్టిపెట్టాయి. అంతకంటే పర్యావరణ సంక్షోభ నివారణకు మరింత స్పష్టమైన కార్యాచరణ, హరిత ఇంధనాలు, నూతన సాంకేతికతలు అవసరం. ఎస్‌సీవో ఈ వాస్తవాన్ని గుర్తించి శాస్త్రీయ, ఆర్థిక సహకారానికి సంస్థాగత పునాది ఏర్పరిచింది. ఈ కూటమి సభ్యదేశాల్లో వైవిధ్యభరితమైన ఇంధన వ్యవస్థలు, ఖనిజ నిక్షేపాలు, పారిశ్రామిక వ్యవస్థలు ఉన్నాయి. భారత్, చైనాలు ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన వినియోగ, అతిపెద్ద పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి దేశాలు కూడా. రష్యా, మధ్య ఆసియా దేశాల్లో అపారమైన చమురు, గ్యాస్, ఖనిజ వనరులు ఉన్నాయి. అదే సమయంలో అనేక మధ్య ఆసియా దేశాలు నీటి కొరత, ఎడారీకరణ, మంచు కరిగిపోవడం, వాతావరణ వైపరీత్యాలను ఎదుర్కొంటున్నాయి. ఎస్‌సీవో సభ్య దేశాల్లో కొన్నింటికి పునరుత్పాదక ఇంధన వనరులతో విద్యుదుత్పాదన, గ్రిడ్ ఆధునికీకరణ తక్షణ ప్రాధాన్యాలైతే- మిగిలిన దేశాలకు హరిత ఇంధనాలతో పారిశ్రామికోత్పత్తి, మీథేన్ తగ్గింపు, జలసంరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, పర్యావరణ పరిరక్షక సాంకేతికతలు అత్యవసరాలు. ఇలా భిన్న అవసరాలు కలిగిన దేశాలను అనుసంధానించే గ్రీన్ టెక్నాలజీ కారిడార్ ఏర్పాటుకు ఎస్‌సీవో ఒప్పందం కుదరడం; అది ప్రపంచ ఇంధన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగానే ఉండటం విశేషం. అంతర్జాతీయ ఇంధన సంస్థ 'ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్-2026' నివేదిక ప్రకారం, ప్రస్తుత ఏడాదిలో ప్రపంచ ఇంధన పెట్టుబడి రికార్డు స్థాయిలో 3.4లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటుంది. ఇందులో దాదాపు 2.2లక్షల కోట్ల డాలర్లు పునరుత్పాదక ఇంధనాలు, అణుశక్తి, విద్యుత్ గ్రిడ్‌లు, ఇంధన సామర్థ్యం పెంపు, విద్యుదీకరణ, హరిత ఇంధన సాంకేతికతలకు ప్రవహిస్తాయి.

ఇటీవల ఆకస్మిక వరదలకు నేపాల్ బాగా దెబ్బతిన్న క్రమంలో, ఎస్‌సీవో హరిత ఇంధన కారిడార్ ఒప్పందం ప్రాధాన్యం సంతరించుకుంది. వాతావరణ మార్పుల పుణ్యమాని ప్రస్తుతం అనేక దేశాల్లోని పర్వత ప్రాంతాల్లో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. అలా పర్వతాల్లో ఏర్పడే విపత్తులు రవాణా వ్యవస్థలను, విద్యుత్ వసతులను, దిగువనున్న జన సముదాయాలను అత్యంత వేగంగా, తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తాయి. ఇలాంటి విపత్తులను ఉపగ్రహ పరిశీలన, రిమోట్ సెన్సింగ్, హిమానీనద పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా నిభాయించాలి. అందుకని, ఈ టెక్నాలజీలను ఎస్‌సీవో హరిత సాంకేతిక అజెండాలో అంతర్భాగం చేయాలి. భారతదేశం అంతరిక్ష ఆధారిత భూపరిశీలన, రిమోట్ సెన్సింగ్‌లో తనకున్న సామర్థ్యాలతో ఈ అజెండాలో పాలుపంచుకోవాలి.

**భారత్ ఎలా లాభపడవచ్చు?**

ఎస్‌సీవో ఒప్పందం భారతదేశానికి వాతావరణ, సాంకేతిక దౌత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మరో అవకాశాన్ని అందిస్తుంది. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు, హరిత సాంకేతికతలను వేగంగా చేపట్టడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కొంటూనే అభివృద్ధి సాధించాలని భారత్ వాదిస్తోంది. గ్రీన్ టెక్నాలజీ కారిడార్‌లో ఇండియా భాగస్వామి కావడం ద్వారా సౌరశక్తి సాంకేతికతలు, అంతరిక్షం నుంచి వాతావరణ నిఘా, పర్యావరణ మార్పుల నిభాయింపునకు డిజిటల్ వ్యవస్థల వినియోగం, ఇంధనాన్ని పొదుపుగా వాడే సాంకేతికతలు, ఈవీ, బ్యాటరీ స్టోరేజ్, విపత్తులపై ముందస్తు హెచ్చరికలు వంటి రంగాల్లో తన సామర్థ్యాలను మధ్య ఆసియా, ఐరోపా మార్కెట్లకు ఎగుమతి చేయగలుగుతుంది. భూతాపాన్ని కట్టడి చేయడానికి హరిత ఇంధన ఆధారిత ఆర్థిక నమూనాలు కావాలి. ఎస్‌సీవో గ్రీన్ కారిడార్ ఆ అవసరాన్ని తీర్చగలదు.

# మారుతున్న సాగు... చదువుల సంగతేంటి?

వాతావరణ అనిశ్చితి, నీటి కొరత, కూలీల సమస్య, పెరుగుతున్న ఖర్చులు, మార్కెట్ ఒడుదొడుకులు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు ఏఐ, డ్రోన్లు, సెన్సర్లు వంటివి సేద్యంలో సరికొత్త అవకాశాలను మోసుకొస్తున్నాయి. మరి, సాగు పద్ధతులు మారుతున్నంత వేగంగా మన వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ వ్యవస్థలు రూపాంతరం చెందుతున్నాయా? వచ్చే పదిహేనేళ్లలో తక్కువ, మధ్యాదాయ దేశాల్లో దాదాపు 160 కోట్లమంది పనిచేసే వయసులోకి రానున్నారు. వీరందరికీ ఉద్యోగ అవకాశాలు సృష్టించాలంటే సేద్యాన్ని కేవలం పంట పండించే ప్రక్రియగానే చూడకూడదు. ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, మార్కెటింగ్, డిజిటల్ సేవలు, అగ్రిటెక్ వ్యాపారాలతో కూడిన ఆహార ఆర్థిక వ్యవస్థగా పరిగణించాలి. యువతకు నాగలితోపాటు డ్రోన్, సెన్సర్, ల్యాప్‌టాప్, స్టార్టప్‌లు కూడా వ్యవసాయంలో భాగమేనని చూపాలి. సాగు నీరు, పంటఖర్చులు, పర్యావరణంపై ప్రభావం తక్కువగా... ఉత్పాదకత, ఆదాయం అధికంగా సాధించడమే రేపటి వ్యవసాయ సూత్రం కావాలి. ఇందుకోసం గ్రామీణ యువతకు మూడు, ఆరు నెలలు, ఏడాది వ్యవధిలో సాగు రంగంలో ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించే నైపుణ్య కోర్సులు రావాలి. డ్రోన్ పైలట్, ప్రెసిషన్




ఇరిగేషన్ ఆపరేటర్, మట్టి పరీక్ష నిపుణులు, ఆహార ప్రాసెసింగ్ పారిశ్రామికవేత్తలు, ఏఐ ఆధారిత వ్యవసాయ సలహాదారు వంటి రేపటి వృత్తులకు తగిన నిపుణులను సిద్ధం చేసుకోవాలి.

**పొలమే ప్రయోగశాల**

కొత్త వ్యవసాయ విద్యాసంస్థల పనితీరు పొలాల్లోనే కనిపించాలి. ఒకేచోట సంప్రదాయ వ్యవసాయాన్ని ప్రెసిషన్ సాగుతో పోల్చి చూపాలి. సంప్రదాయ నీటి పారుదలతో సెన్సర్ ఆధారిత నీటి నిర్వహణను పోల్చి చూపితే... ఎంత నీరు ఆదా అయ్యిందో, ఖర్చెంత తగ్గిందో, దిగుబడి ఎంత పెరిగిందో తెలుస్తుంది. డ్రోన్, ఉపగ్రహం, సెన్సర్, ఏఐ, మార్కెటింగ్ ప్రక్రియనంతా ఒకే ప్రాంగణంలోనే చూడగలగాలి. ఏపీలోని మదనపల్లె సమీపంలో రిలయన్స్ సహకారంతో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నం ఇటువంటిదే. తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని చోట్ల ఇవి అందుబాటులోకి రావాలి. ఆ క్రమంలోనే, వివిధ వాతావరణ ప్రాంతాలను అనుసంధానిస్తూ వ్యవసాయ నవకల్పనల హబ్ నెట్‌వర్క్‌ను నిర్మించవచ్చు. విశ్వవిద్యాలయాలు, ఐసీఏఆర్ సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలను వాటితో అనుసంధానించవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో సాగు అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. అందుకని ఒక రాష్ట్రం, ఒక మెగాస్కూల్, ఒక వ్యవసాయ ఎకలాజికల్ రీజియన్, ఒక ఇన్నోవేషన్ హబ్ మెరుగైన నమూనాగా చెప్పవచ్చు. రాయలసీమలో వేరుశనగ, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, సూక్ష్మసేద్యం అవసరం. కోస్తాంధ్రలో వరి యాంత్రీకరణ, ఆక్వా, ఉద్యాన పంటలు, తుపాన్లను తట్టుకునే వ్యవసాయం కావాలి. ఉత్తరాంధ్రలో చిరుధాన్యాలు, సహజ వనరుల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు. తెలంగాణలో పత్తి, వరి, పప్పులు, నూనెగింజలు, విత్తన వ్యవస్థలు, డ్రోన్లు, డిజిటల్ వ్యవసాయం చుట్టూ ప్రత్యేక కేంద్రాలు రావచ్చు. మనం కొత్తగా ఆలోచిస్తున్న అనేక అంశాలపై ప్రపంచం ఇప్పటికే పలు ప్రయోగాలు చేస్తోంది. ఇజ్రాయెల్, నెదర్లాండ్స్ సరికొత్త నమూనాలను అభివృద్ధి చేశాయి. అబుదాబిలోని సీజీఐఏఆర్ ఏఐహబ్ కొత్త దిశ చూపుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఇక్రిశాట్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐసీఏఆర్ పరిశోధనా సంస్థలున్నాయి. విస్తృత స్థాయిలో కేవీకే, ఐటీ వ్యవస్థలున్నాయి. వీటన్నింటినీ అనుసంధానిస్తూ బలమైన వ్యవసాయ ఏఐ ఎకోసిస్టమ్‌ను నిర్మించవచ్చు. ఇన్నోవేషన్ హబ్‌లో విజయవంతమైన సాంకేతికతలు కేవీకేల ద్వారా గ్రామాలకు చేరాలి. అక్కడి రైతు సమస్యలు తిరిగి శాస్త్రవేత్త, ఇంజినీర్, స్టార్టప్ దగ్గరికి చేరేలా చూడాలి.

**కొత్త ఆలోచనలతో...**

భారత్, ఆఫ్రికాలోని చిన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో సారూప్యం ఉంది. చిన్న కమతాలు, వర్షాధార సాగు, వాతావరణ అనిశ్చితి, పరిమిత యాంత్రీకరణ, మార్కెట్ సమస్యలున్నాయి. ఇక్రిశాట్ వంటి సంస్థలతో కలిసి తెలుగు రాష్ట్రాల్లో పరీక్షించిన డిజిటల్ సలహాలు, కరవు నిర్వహణ, చిన్న యంత్రాలు, డ్రోన్లు, ఏఐ నమూనాలను ఆఫ్రికా పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేయవచ్చు. అక్కడి ఆవిష్కరణల నుంచి మనమూ నేర్చుకోవచ్చు. ఇందుకు ప్రభుత్వానికి తోడుగా సీఎస్ఆర్ నిధులు, దాతృత్వ సంస్థలు, బ్యాంకులు, టెక్నాలజీ కంపెనీలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థల భాగస్వామ్యం అవసరం. వ్యవసాయానికి ఇప్పుడు మరిన్ని కళాశాలలు మాత్రమే కాదు, కొత్త ఆలోచనలను పొలంలో పరీక్షించే వేదికలు కావాలి. సాంకేతికతను రైతుకు అర్థమయ్యేలా చూపించే కేంద్రాలు రావాలి. ప్రపంచ విజ్ఞానాన్ని మన రైతు పొలంతో అనుసంధానించే వ్యవస్థ ఏర్పడాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాలు వ్యవసాయ విప్లవానికి సరైన దశాదిశా చూపగలవు.

# ఏఐ తరం... బోధన మారాల్సిన తరుణం!

భారతీయ నాగరికతలో 'ఆచార్య దేవోభవ' అనే మాట వేల సంవత్సరాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉంది. గురువు ప్రాధాన్యం నేడు మరింతగా పెరుగుతోంది. ఆధునిక సమాజానికీ, అవసరాలకూ తగ్గట్లు భావితరాన్ని తీర్చిదిద్దడానికి ఇప్పుడు ఉన్న నియామక పద్ధతులు, శిక్షణ సరిపడవు. వీటిలో సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం. అప్పడే 'వేదికపై రుషి'గా భావించే తరగతి గదిలోని ఉపాధ్యాయుణ్ని 'ఆవిష్కరణకు తోడ్పడే మార్గదర్శి'గా చూడగలం. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా... టచ్ స్క్రీన్‌లు, సెర్చ్ ఇంజిన్లు, అల్గారిథమిక్ సిఫారసులు లేని ప్రపంచాన్ని నేటి విద్యార్థులు చూడలేదు. ఈ పరిస్థితి బోధనా విధానంలో నిశ్శబ్దంగా మార్పు తీసుకొస్తోంది. జాతీయ విద్యావిధానం-2020, జాతీయ పాఠ్యప్రణాళిక చట్టం-2023 రెండూ ఈ మార్పును అధికారికంగానే నిర్దేశిస్తున్నాయి. కేవలం పరీక్షల కోసం చదవడం కాదు; సామర్థ్య ఆధారిత అభ్యాసన, ఉన్నతస్థాయి ఆలోచనలు, వైఖరులు వంటివాటి ఆధారంగానే మూల్యాంకనం జరగాలంటున్నాయి. కృత్రిమ మేధ(ఏఐ) ఒక ప్రశ్నను విద్యార్థికి తగ్గట్లు రాసివ్వగలదు, అర్ధరాత్రి పూట అయినా ఏ అంశాన్నయినా బోధించగలదు. కానీ- నిత్యం చురుగ్గా ఉండే ఒక సాధారణ బాలుడు ఎందుకు విచారంగా ఉన్నాడో గ్రహించి, ఆ పిల్లాణ్ని దగ్గరకు తీసుకుని ఆత్మీయంగా, కరుణాభావంతో మాట్లాడలేదు. ఫ్రెంచ్ విప్లవ పాఠాన్ని కాసేపు పక్కనపెట్టి.. చుట్టూ జరుగుతున్న యుద్ధాల గురించీ, శాంతి కోసం ఏం చేయగలమో



చర్చించండని ఒక కంప్యూటర్ పిల్లలను అడగలేదు. ఎందుకంటే, దానికి భావోద్వేగాల స్పర్శ తెలియదు, తాత్విక ఆలోచనలను విద్యార్థుల్లో పెంపొందించలేదు. అందుకే, 21వ శతాబ్దపు నైపుణ్యాలతో ఏఐనీ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ సమన్వయపరుస్తూ విద్యా వ్యవస్థను ముందుకు నడిపించడంలో ఉపాధ్యాయులు అతి ముఖ్యమైన, అనివార్యమైన చోదకశక్తులుగా నిలుస్తున్నారు.

**సమాచారానికి కొదవ లేదు...**

నేడు ఉపాధ్యాయుడి పాత్ర జ్ఞాన ప్రదాత మాత్రమే కాదు; అంతకంటే విలువైన మార్గదర్శి, నైతిక దిక్సూచి కూడా. అందువల్ల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అన్నట్లు ఈ కాలం 'ఉపాధ్యాయులు దేశంలోనే అత్యుత్తమ మేధావులై ఉండాలి'. చిటికెలో సమాధానాలిచ్చే యంత్రాలు ఉన్న డిజిటల్ యుగంలో, తరగతి గదులకు కావాల్సింది ఎన్‌సైక్లోపీడియా లాంటి మెదడు కాదు... సృజనాత్మకంగా, వివేచనతో ఆలోచించే మనసు. అందుకే ఉపాధ్యాయులు విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యాలకు తోడు విద్యా సాంకేతికత, పిల్లల మనస్తత్వశాస్త్రం, డేటా ఆధారిత బోధన, నాయకత్వ లక్షణాలను నిరంతరం అలవర్చుకోవాల్సి ఉంది.

భారతదేశ విద్యారంగంలో ఇప్పుడు ఒక మంచి మార్పు కనిపిస్తోంది. సాధారణ ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు రచిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకుంటున్నారు. శిక్షణ భాగస్వామ్య కార్యక్రమాల కోసం విదేశీ ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాల ఆహ్వానం అందుకుంటున్నారు. అబ్దుల్ కలామ్ అన్నట్లుగా, 'ఒక వ్యక్తి తత్వాన్నీ సామర్థ్యాన్నీ భవిష్యత్తునూ తీర్చిదిద్దే అత్యంత గొప్ప వృత్తి'గా బోధనను ఎంచుకుంటున్నారు. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే, రాబోయే దశాబ్దంలో విద్యారంగం భవిష్యత్తు ఎలా ఉండనుందో అర్థమవుతుంది. ఏఐ తను బాగా చేయగలిగిన పనులను నిశ్శబ్దంగా నిర్వహిస్తుంది, ఉపాధ్యాయుడు మనిషి మాత్రమే చేయగల పనులపై దృష్టి పెట్టడానికి తగినంత సమయం కేటాయిస్తాడు. 2035 నాటి తరగతి గదికి సమాచార బోధకులే కాదు; కొత్త ఆలోచనలకు స్ఫూర్తినిచ్చే, వ్యక్తిత్వ నిర్మాణానికి తర్ఫీదునిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే నిపుణులూ అవసరమవుతారు. నేడు సమాచారానికి కొదవలేదు కానీ వివేచన, నైతిక స్థైర్యం, ఆత్మశక్తికి తీవ్ర కొరత ఉంది. వాటిని విద్యార్థుల హృదయాల్లో అంకురింపజేయడం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుంది.

**నియామకాల్లో సంస్కరణలు అవసరం**

పాఠ్యప్రణాళిక ఎంత గొప్పగా ఉన్నాసరే, తరగతి గదిలో దానికి జీవం పోసేది మాత్రం ఉపాధ్యాయుడే. 'జెన్ ఆల్ఫా'కు తోడు ఏఐ కూడా తరగతి గదిలోకి వచ్చేసిన తరుణంలో ఉపాధ్యాయుల ఎంపికకు మునుపటి తరం నియామక పరీక్షలు, బోధనా పద్ధతులు, శిక్షణ సరిపడవు. వీటిలో మార్పు రాకపోతే, ఎంత మంచి పాఠ్యప్రణాళిక అయినా కాగితాలకే పరిమితమవుతుంది. టెట్, సీటెట్ వంటి ఉపాధ్యాయ అర్హత పరీక్షలను మరింత కఠినతరం చేసి, రెండేళ్లకోసారి కాకుండా నిరంతర(రోలింగ్) మదింపు విధానాన్ని ప్రవేశపెట్టాలి. సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు అభ్యర్థుల బోధనా దృక్పథాన్నీ, పిల్లల మనస్తత్వాన్ని అవగాహన చేసుకునే సామర్థ్యాన్నీ, భావోద్వేగ సున్నితత్వాన్నీ పరీక్షించాలి. రాత పరీక్షల్లో మంచి మార్కులు సాధించినవారు తరగతి గదిలో బాగా రాణించగలరని చెప్పలేం. కాబట్టి, అర్హత పరీక్ష చివరి దశలో ప్రత్యక్ష బోధనా ప్రదర్శనను తప్పనిసరి చేయాలి. జాతీయ ఉపాధ్యాయ రిజిస్ట్రీని బ్లాక్‌చెయిన్ ఆధారిత ధ్రువీకరణ పత్రాలతో ఏర్పాటు చేయడం ద్వారా నకిలీ సర్టిఫికెట్లు, డూప్లికేట్ నియామకాలను నిరోధించవచ్చు. నియామక ఫలితాలు, మెరిట్ జాబితా, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లో, రియల్‌టైమ్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కాంట్రాక్టు, తాత్కాలిక నియామకాలకు బదులు, ప్రొబేషన్ తరవాత పనితీరు ఆధారంగా శాశ్వత నియామకాన్ని ఖరారు చేయాలి. ఏఐ తోడ్పాటుతో ఉపాధ్యాయుడి పనితీరు డేటాను విశ్లేషించి, ఏయే అంశాల్లో మెరుగుదల అవసరమో గుర్తించడంతో పాటు వ్యక్తిగతీకరించిన శిక్షణను అందించాలి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను 'టీచర్ ఆఫ్ టీచర్స్'గా తీర్చిదిద్దడం ద్వారా మెంటార్‌షిప్ సర్కిల్స్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్) స్థానంలో స్వీయమూల్యాంకనం, తోటి ఉపాధ్యాయుల అభిప్రాయం, పాఠశాల నాయకత్వ మదింపు, విద్యార్థులూ తల్లిదండ్రుల అభిప్రాయంతో కూడిన నిరంతర, బహుముఖ మూల్యాంకనాన్ని (360డిగ్రీ ఫీడ్‌బ్యాక్‌ను) ప్రవేశపెట్టాలి. వృత్తి ఎదుగుదలను సర్వీసు ఆధారంగా కాకుండా, పనితీరు ఆధారంగా నిర్ణయించాలి. స్వతంత్ర మూడోపక్షం అకడమిక్ ఆడిట్‌లను సర్కారీ బడులకూ విస్తరించాలి. ఏదిఏమైనా నాణ్యమైన చదువుల కోసం నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేసుకోవడం కీలకమని ప్రభుత్వాలు గుర్తించాలి!

# ప్రమాద ఘంటికలు

ఎంతసేపూ అభివృద్ధి, లాభార్జన, ఆర్థికప్రగతి గురించి మాత్రమే హోరెత్తే ప్రపంచంలో వాతావరణం ఎలావుందో, అది మున్ముందు ఎలా పరిణమిస్తుందో హెచ్చరించే సంస్థలు కూడా ఉన్నాయి. పరుగులు ఆపి సరిచూసుకోనట్టయితే ఈ భూగోళమే పెను ప్రమాదంలో పడుతుందని ఆ సంస్థలు మరోసారి హెచ్చరించాయి. ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ), ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(యూఎన్‌ఈపీ)లు ఒకరోజు తేడాలో తమ నివేదికలు విడుదల చేశాయి. 'అత్యంత బలమైన' ఎల్‌నినో విరుచుకుపడటం, అది వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ కొనసాగటం తథ్యమని డబ్ల్యూఎంఓ చెబుతోంది. అందువల్ల ఉష్ణోగ్రతల్లో తీవ్ర మార్పులు చోటుచేసుకోవటంతోపాటు వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆ సంస్థ వివరించింది. ఈ దశాబ్దం చివరినాటికి ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని యూఎన్‌ఈపీసంస్థ హెచ్చరించింది. ప్రభుత్వాల విధానాలు ఇప్పుడున్న విధంగానే కొనసాగితే2100 నాటికి ఉష్ణోగ్రతలు 2.6 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతుందని అది జోస్యం చెప్పింది.

కానీ పారిస్ ఒప్పందంలో పూచీపడిన విధంగా ప్రభుత్వాలు కర్బన ఉద్గారాలు తగ్గించుకుంటే అది 1.8 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమయ్యే అవకాశం లేకపోలేదని వివరించింది. ఈ రెండు సంస్థలూ చెప్పాయని కాదు... రాబోయే రోజులెలా ఉండబోతు న్నాయో ప్రస్తుత పరిస్థితులే చెబుతున్నాయి. ఇటీవల నేపాల్‌లో వచ్చిన మెరుపు వరదల వల్ల దాదాపు 1,300 మంది చనిపోగా, అనేకులు ఆచూకీ లేకుండా పోయారు. ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. కనీవినీ ఎరుగని విధ్వంసం చోటుచేసుకుంది.

పర్యావరణ పరిరక్షణతో సమస్త జీవుల మనుగడ ముడిపడివుందని ప్రపంచంగ్రహించి దాదాపు అరవయ్యేళ్లవుతోంది. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వంటి పాలకుల పుణ్యమా అని ఇప్పటికీ వివాదాస్పద అంశంగానే ఉంటోంది. పర్యావరణ ధ్వంసం అమెరికా అభివృద్ధి గిట్టనివారి సృష్టి అని ఆయన అభిప్రాయం. తమ ప్రయోజనాలకు విఘాతం కల్గిస్తుందంటూ ఏకంగా పారిస్ ఒప్పందం నుంచి నిష్క్రమించారు. విషాదమేమంటే ఆ ఒప్పందంలో కొనసాగుతూ కూడా, దాని లక్ష్యాలను విస్మరిస్తున్న దేశాలున్నాయి.

అభివృద్ధి పేరిట ఇష్టానుసారం ప్రాజెక్టులకు




అనుమతు లీయటంవల్ల పర్యావరణం దెబ్బతింటోందని, కాలుష్యం పెరుగుతున్నదని పర్యావరణ ఉద్యమకారులు వాదిస్తుంటే... మరి అభివృద్ధి మాటేమిటన్నది ప్రభుత్వాల ప్రశ్న. పారిశ్రామిక విప్లవంకంటే ముందునాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే 2030 నాటికి సగటు ఉష్ణోగ్రత పెరుగుదల కనీసం 1.5 డిగ్రీల సెల్సియస్ లోపులో ఉంచాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ అది 2 డిగ్రీలు దాటరాదని పారిస్ ఒప్పందం నిర్దేశించింది. ఇందుకోసం గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను 42 శాతం మేర తగ్గించాలి. కానీ ప్రపంచవ్యాప్తంగా దేశాలు పాటిస్తున్న విధానాలేవీ దానికి అనుగుణంగా లేవు. అందువల్లే ధ్రువప్రాంతాల్లో వేగంగా మంచు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం, పెను తుపానులు, కరువుకాటకాలు, అత్యధిక ఉష్ణోగ్రతలు సర్వసాధారణమయ్యాయి.

చారిత్రకంగా చూస్తే 1850 నుంచి ఇంతవరకూ 25 శాతం ఉద్గారాలతో అమెరికా ప్రథమ స్థానంలో ఉంటే దాదాపు 22 శాతం వాటాతో యూరప్ దేశాలు, దాదాపు 7 శాతంతో రష్యా ఉన్నాయి. కానీ ఏటా వెలువరించే కర్బన ఉద్గారాల్లో చైనా ఇప్పుడు అగ్రభాగాన ఉంది. తలసరి ఉద్గారాల్లో ఇప్పటికీ మనం ప్రపంచ సగటుకన్నా తక్కువగానే ఉన్నాం. పునరుత్పాదక ఇంధన రంగానికి మారడానికి అవసరమైన సాంకేతికతలనుపొందాలంటే భారీ మొత్తంలో నిధులు అవసరమవుతాయన్న అంచనా ఉంది.

అయితే అభివృద్ధి చెందిన దేశాలు ఈ సాంకేతికతల్ని చవగ్గా అందిస్తే మనం మాత్రమే కాదు... చాలా దేశాలు వీటిని పొందగలుగుతాయి. నిరుడు బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరిగిన కాప్–30 సదస్సులో కొత్త సాంకేతికతల కోసం 2035 నాటికి 31,000 కోట్ల డాలర్లు అవసరమవుతాయని అంచనా వేశారు. భూగోళమే ప్రమాదంలో పడిందని సమితిసంస్థలు రెండూ చెబుతున్న నేపథ్యంలోనైనా సంపన్న దేశాలు లాభార్జన దృష్టి విడనాడాలి. లేకుంటే మూకుమ్మడిగా అందరం మునిగే ప్రమాదం ఉంటుందన్న స్పృహ తెచ్చుకోవాలి.

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

బుధవారం | అనంతపురం | 09.09.2026 | 01


## నివాస స్థలాలపై దౌర్జన్యం.. న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



**అనంతగిరి, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

పాడేరు మండలం పాతపాడేరు గ్రామంలో 40 ఏళ్లుగా నివాసం ఉంటూ సాగు చేసుకుంటున్న తమ భూములను కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వంతాల అచ్చియమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ కోడలు సీతపై దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.కలెక్టర్ గ్రీవెన్స్‌తో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సర్వే సమయంలోనూ అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. భూములపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు.

## ఈ నెల 16న లోకేష్ చేతుల మీదుగా

# పాఠశాలల ప్రారంభం

**- పొంగూరు షరణి**

**- వి ఆర్ స్కూల్ కంటే మెరుగ్గా డి ఎస్ ఆర్, ఆర్ ఎస్ ఆర్ లను తీర్చిదిద్దుతాం**

**- లోకేష్ రాకతో నెల్లూరు బడులకు కొత్త కళ..**

**- పనుల పరిశీలనలో వేగవంతం**

**- నారాయణ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం..**

**- లోకేష్ ప్రారంభోత్సవానికి డి ఎస్ ఆర్, ఆర్ ఎస్ ఆర్ బడులు సిద్ధం.. షరణి**

**నెల్లూరు సెప్టెంబర్ 08 అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరులోని మూలపేట డీఎస్ఆర్, స్టోన్ హౌస్ పేట ఆర్ఎస్ఆర్ పాఠశాలలను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 16వ తేదీ రానున్న నేపథ్యంలో.. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి మంగళవారం ఈ పాఠశాలలను సందర్శించారు..పాఠశాల మైదానాలు, తరగతి గదులను పరిశీలించిన ఆమె, చదువుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు ఎన్సిసి విద్యార్థులకు అందుతున్న శిక్షణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్వయంగా పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అనంతరం షరిణి మాట్లాడుతూ... గతంలో వి ఆర్ పాఠశాలను ఏ విధంగానైతే డెవలప్ చేశామో, అంతకంటే మెరుగ్గా డిఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను రినోవేట్ చేయాలని మా నాన్నగారు బాధ్యత అప్పగించారని తెలిపారు. లోకేష్‌గారు వచ్చే లోపే గ్రౌండ్ వర్క్ నుంచి క్లాస్ రూమ్‌ల వరకు అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, మౌలిక సదుపాయాలతో పాటు టీచర్ క్వాలిటీ, అకాడమిక్స్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు ప్రజలు నారాయణ గారిపై ఉంచిన నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 39,40డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అన్నంగి ప్రసాద్ జనరల్ సెక్రటరీ మధుసూదన్,వైస్ ప్రెసిడెంట్ మురళీ మోహన్,నాయకులుదీనదయాల్,మురళీ, కృష్ణసింగ్,విజయలక్ష్మి, రాజేష్, 8,10వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమల నాయుడు,కోక్లస్టర్ ఇన్‌చార్జ్ హేమంత్, యూనిట్ ఇంచార్జి వెంకట్రావు,వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, గయాజ్,శ్రీమన్నారాయణ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ లో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**- జిల్లా నేతలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ పొలిటికల్ కమ్యునికేషన్‌పై చర్చ - ఎల్ నినోపై అవగాహన**

**అనంతపురం సెప్టెంబర్ 08,**

**అనంత జనశక్తి న్యూస్**



మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన 2వ రోజు టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధ్యక్షులు ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ పాల్గొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మరింత చేరువగా పనిచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలుఅభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడం వంటి పలు ముఖ్యమైన అంశాలపై అధ్యక్షుడు చంద్రబాబు, నారా లోకేష్ దిశా నిర్దేశ్యం చేశారు. సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యునికేషన్‌పై చర్చ ఎల్ నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. అధినేత చంద్రబాబు నాయకత్వ సామర్థ్యం పెంపుపై దిశానిర్దేశం చేశారు. అలాగే సమష్టి కార్యాచరణపై సూచనలు చేశారు



## ప్రభుత్వ విధుల్లో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

**- అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా క్షేత్రస్థాయి అధికారులు పనిచేయాలి**

**- ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత సచివాలయ అధికారులదే**

**- పేదలకు సేవ చేసే అవకాశం ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి దేవుడిచ్చిన వరం**

**- పుట్టపర్తి మున్సిపాల్టీలోని బ్రాహ్మణపల్లి,ఎనుములపల్లి, ప్రశాంతి గ్రామ్ లోని సచివాలయాలను సందర్శించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 08: అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులకు సూచించారు.పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ,బ్రాహ్మణపల్లి, ప్రశాంతి గ్రామంలోని సచివాలయాలను మంగళవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవ కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది తో అడిగి తెలుసుకున్నారు.కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల నమోదు ప్రక్రియను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడి దరఖాస్తుల స్వీకరణ, అర్హతల పరిశీలన, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై వివరాలు ఆయన తెలుసుకున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సచివాలయాలకు వచ్చినప్పుడు వారిని గౌరవంగా స్వీకరించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో సచివాలయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుందని తెలిపారు. "పేదలు, అర్హులైన ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి దేవుడిచ్చిన వరంగా భావించాలి. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన బాధ్యత" అని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందేలా పారదర్శకంగా పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెంట రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, శుభచంద్ర ,టిడిపి నాయకులు బోయ రామాంజనేయులు, రామారావు లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, ఉమాపతి ,అంబులెన్స్ రమేష్,కృష్ణప్రసాద్ , సురేష్,పుట్టపర్తి మున్సిపాలిటీ చెందిన టిడిపి ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## అన్నా క్యాంటీన్‌లో పొంగూరు షరణి సందడి



**- సామాన్యులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారాయణ కుమార్తె**

**- 5 రూపాయలకే భోజనం నాణ్యతపై పొంగూరు షరణి ప్రశంసలు**

**- పేదలకు కొండంత అండ..**

**అన్నా క్యాంటీన్ భోజనం బాగుంది: షరణి**

**నెల్లూరు సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు నగరంలోని తడికలబజార్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగురు నారాయణ కుమార్తె పొంగూరు షరణి ప్రత్యేకంగా సందర్శించారు. ముందుగా కౌంటర్ దగ్గర 5 రూపాయల టికెట్ టోకెన్ తీసుకొని, వరుస క్రమంలో నిలబడి భోజనం తీసుకున్నారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యతను, రుచిని ఆమె స్వయంగా తిని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఐదు రూపాయలకే కడుపునిండా పౌష్టికాహారం లభించడం పేదలకు, సామాన్యులకు కొండంత అండగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.అనంతరం అక్కడికి వచ్చిన సామాన్య ప్రజలతో కలిసి షరణి భోజనం చేశారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యురాలు తమతో కలిసి భోజనం చేయడమే కాకుండా, తమ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకోవడంతో పేద ప్రజలు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలనే ఉన్నతాశయంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లు ఎందరో దినసరి కూలీలకు ప్రాణధారగా మారాయని అక్కడ భోజనం చేస్తున్న స్థానికులు సంతోషంగా కొనియాడారు.

## మంగళగిరిలో టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్ పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.

**మంగళగిరి సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కాంక్లేవ్‌లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొన్నారు. సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సురేంద్రబాబు కాంక్లేవ్‌కు హాజరయ్యారు. టీడీపీ నాయకత్వం, పార్టీ బలోపేతం, ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించే అంశాలపై కాంక్లేవ్‌లో చర్చలు జరుగుతున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించిన అంశాలతో పాటు పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై కూడా నాయకులు దృష్టి సారించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## సచివాలయం ఆకస్మిక తనిఖీ.

**- ధర్మవరంలో నూతన పింఛన్ దరఖాస్తుల ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**

**- సచివాలయంలో దరఖాస్తుల పరిశీలన, ఇ-కేవైసీ నమోదు తీరు సమీక్ష**

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పింఛన్ అందజేయాలని అధికారులకు ఆదేశం : కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్,08, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణ పరిధిలోని 15వ వార్డు, గాంధీనగర్ సచివాలయాన్ని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సచివాలయంలో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, క్షేత్ర స్థాయి వెరిఫికేషన్, దరఖాస్తుల ప్రస్తుత స్థితి మరియు ఇకేవైసీ ప్రక్రియలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని, అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడూ విడిపోకుండా పక్కాగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.దరఖాస్తుల వెరిఫికేషన్ మరియు ఈ కేవైసీ నమోదులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్దేశిత సమయానికే అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించారు.సచివాలయ సిబ్బంది కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు అందుబాటులో ఉంటూ, ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,స్థానిక సచివాలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## నేత్రదానానికి గొప్ప మనసు ఉండాలి.

**- నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన నేత్ర దాత పి. నరసింహారెడ్డి.**

**ధర్మవరం సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్:**



**నేత్రదానముతో ఇద్దరి జీవితాల్లో నేత్రదాత పి నరసింహారెడ్డి వెలుగులు నింపారు. రాప్తాడు మండలం యర్రగుంటకి చెందిన పప్పూరు నరసింహారెడ్డి (73) వృద్ధాప్యం తో మరణించగా, విశ్వదీప సేవా సంఘం సభ్యులు నేత్రదానంపై వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో వారు నేత్రధానం కి సహకరించినందున జిల్లా అందత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డివై కుల్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ వారి టెక్నీషన్ జి. రాఘవేంద్ర కంటి కార్నియా సేకరించడం జరిగింది . నేత్రదానానికి సహకరించిన దాత భార్య లక్ష్మి నారాయణమ్మ, కుమారుడు విశ్వనాథ్ రెడ్డి, కోడలు లలిత, కుమార్తెలు ఉమాదేవి, మంజుల అల్లుళ్ళు హరినాథ్ రెడ్డి, సాంబశివారెడ్డి తమ్ముడు పప్పూరు బయపురెడ్డి మరదలు లక్ష్మీదేవి సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు గాజుల సురేష్,ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి సెక్రటరీ జుజారు రఘు, ధనుంజయ విశ్వదీప సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. నేత్రదానం చేయువారు 9392323605,9666629841 కు ఫోను చేయగలరు.**

## కొత్తూరు పంచాయతీలో రైతులకు భూ పాస్ పుస్తకాల పంపిణీ

**అనంతగిరి, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలోని తీగలమడ, లక్ష్మీపురం గ్రామాల రైతులకు భూ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మార్వో వీరభద్రాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తడబారికి మితుల ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.భూ పాస్ పుస్తకాలు, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డుల వంటి ముఖ్యమైన పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# టీడీపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు సమష్టిగా పనిచేయాలి

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్**

**పుట్టపర్తి: సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**



విజయవాడలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో రెండో రోజు నిర్వహించిన టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ సమావేశంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రులు పయ్యావుల కేశవ్ ,సవితమ్మ, టీడీపీ ఎమ్మెల్యేలు పరిటాల సునీతమ్మ, బండారి శ్రావణి, ఎమ్మెస్ రాజు ,పరిటాల శ్రీరామ్ , ఎంపీలు, ఎమ్మెల్సీలు, పలువురు పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. సమావేశానికి ముందు టీడీపీ కార్యాలయ ఆవరణలోని మహానేత ఎన్టీఆర్ భారీ విగ్రహానికి మహిళా ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు పరిటాల సునీత, బండారి శ్రావణి, రెడ్డప్ప గారి మాధవి, భూమా అఖిలప్రియ, వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి తదితర మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ప్రజల సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందిస్తున్న తీరు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై సమావేశంలో దిశానిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పార్టీ నాయకులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తూ, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా నియోజకవర్గాల వారీగా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజలతో నిరంతరం మమేకమై టీడీపీకి మరింత బలమైన పునాది ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు.

# టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటరామిరెడ్డి మృతి బాధాకరం



**- భౌతికదేహానికి నివాళులర్పించిన మంత్రి సవిత**

**రొద్దం సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**

సత్యసాయి జిల్లా రొద్దం మండలం గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీమతి ఎస్. సవిత పేర్కొన్నారు.వెంకటరామిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న మంత్రి సవిత గోనిమేకలపల్లి గ్రామానికి వెళ్లి ఆయన భౌతికదేహానికి తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి సవితమ్మ పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వెంకటరామిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి సవితమ్మ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రొద్దం మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# ప్రజాసేవే లక్ష్యం..అభివృద్ధే అజెండాగా సాగిన లీడర్షిప్ కాంక్లేవ్ కార్యక్రమం

**- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**అనంతపురం సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజు కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సహచర ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసేవ, సుపరిపాలన, పార్టీ-ప్రభుత్వ సమన్వయం, రాజకీయ కమ్యూనికేషన్ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని నియోజకవర్గ స్థాయి అభివృద్ధితో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. నీటి వనరుల అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించడంతో పాటు, రాజకీయ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడం, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలపైనా కాంక్లేవ్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అందించిన దిశానిర్దేశం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మరింత చురుగ్గా పనిచేస్తామని పేర్కొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

**- జిల్లాలోని వయోజనుల్లో 100 శాతం అక్షరాస్యత సాధించడమే అక్షర ఆంధ్ర లక్ష్యం**

**అనంతపురం, సెప్టెంబర్ 08 : అనంత జనశక్తి న్యూస్**



60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అనంతపురం రూరల్ మండల మహిళ సమాఖ్య కార్యాలయం ప్రాంగణంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహాధికారి (సిఈఓ) విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని వయోజనుల్లో 100 శాతం అక్షరాస్యత సాధించడమే అక్షర ఆంధ్ర లక్ష్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని వినియోగించుకుని జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలోని నిరక్షరాస్య మహిళలు, విబి జి రాంజీ గ్రూపు సభ్యులలోని పురుషులు మరియు సమాజంలో 15 సంవత్సరాలు వయస్సు పైబడిన నిరక్షరాస్య వయోజనులు అందరూ ఈ కార్యక్రమం ద్వారా సెప్టెంబరు 08, 2026 నుండి ఫిబ్రవరి నెల 2027 వరకు నిర్వహించబడుతున్న 'అక్షర ఆంధ్ర' అభ్యసన తరగతులకు హాజరై చదువుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి నాసర రెడ్డి మాట్లాడుతూ 202627 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించి ప్రతి పది మంది చదువురాని వారికి ఒక వాలంటరీ టీచర్ ని గ్రామములోని విఓఎ, ఫీల్డ్ అసిస్టెంట్ ల ద్వారా వెల్ఫేర్ అసిస్టెంట్స్ ఎంపిక చేయడం జరిగిందన్నారు. చదువు ఉంటే జీవితంలో స్థిర పడగలమని, అభివృద్ధి చెందగలమని, అందరు చదువుకోవాలని కోరారు. జిల్లా పంచాయతి అధికారి నాగరాజు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలందరూ అభివృద్ధి చెందాలన్నారు.వయోజన విద్య ఉపసంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈరోజు నుండి వాలంటీర్ టీచర్లు స్వచ్ఛందంగా బోధన చేస్తారని, అభ్యాసకులు దగ్గరలో గల అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలలో ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు తరగతులు నిర్వహించబడతాయన్నారు. అక్షర ఆంధ్ర యాప్ ద్వారా వీడియో పాఠాలు మరియు టెక్స్ట్ పుస్తకాలు అందజేయడం జరుగుతుందని, మొత్తం మీద 40 గంటలు పాఠ్యపుస్తకాలు, 45 గంటలు వర్క్ బుక్ ఎక్సర్సైస్, 15 గంటలు వీడియో పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు. తదనంతరం మార్చి నెలలో NIOS వారు నిర్వహించే FLNA పరీక్షలలో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తించబడడం ద్వారా అనంతపురం జిల్లా అక్షరాస్యత అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. వయోజన విద్య సహాయ సంచాలకులు బి.వి.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ లిటరసీ ఫైనాన్షియల్ లీటరసీ, ఫంక్షనల్ లీటరసీపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని స్వయం సహాయక సంఘ గ్రూపు సభ్యులకు తెలియజేశారు.మండల అభివృద్ధి అధికారి దివాకర్ మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలాన్ని చదువుకున్న విద్యార్థినీ విద్యార్థుల సహకారంతో వయోజనులలో అక్షరాస్యత అభివృద్ధిని సాధిస్తామని హామీ ఇచ్చారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం ప్రత్యేకించి ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులకు చాలా ఉపయోగపడుతుందని, దీని ద్వారా సమాజంలో పేదరికం నిర్మూలించవచ్చని, వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం వయోజన విద్య సిబ్బంది పి.సూర్యనారాయణ, పర్యవేక్షకులు జి.పరమేశ్వరప్ప, జి.వి.రమణ, జి.రవి, పి.శ్రీధర్, ఎం.లక్ష్మినారాయణ, ఎ.పి.ఎం రవి, ఎ.పి.ఓ నాంచారమ్మ, వెలుగు సీసీలు, వివోఏలు, SHG గ్రూపు సభ్యులు, ఎన్ఆర్ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్ పాల్గొన్నారు. పొదుపు మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల ద్వారా చదువు ప్రాధాన్యత గురించి వివరించడం అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పక్షోత్సవాలలో భాగంగా వివిధ కాళాశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందచేయడం జరిగింది.

# యువతకు ఉద్యోగాల జాతర

**- ఒకే వేదిక పై 100+ కంపెనీలు..**

**- 3,000 మందికి పైగా యువతకు అవకాశాలు.....**

**ధర్మవరం సెప్టెంబర్ 8 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం యువత భవిష్యత్తుకు మరో బలమైన అడుగు పడింది. ఉద్యోగం కోసం యువత కంపెనీల చుట్టూ తిరగకుండా.. కంపెనీలనే యువత ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ ఎస్ డి సి ), మా సంస్కృతి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. గత ఏడాది జనవరిలో నిర్వహించిన జాబ్ మేళాలో 2,000 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించగా.. ఈసారి అంతకంటే భారీ స్థాయిలో 100కు పైగా ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. 3,000 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.

ఒక ఉద్యోగం అంటే ఒక వ్యక్తికి మాత్రమే ఉపాధి కాదు.. ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా. అందుకే యువతకు ఉపాధి కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

చదువుకున్నా ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్న యువతకు.. తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది. వివిధ రంగాలకు చెందిన కంపెనీలు నేరుగా అభ్యర్థులను ఎంపిక చేసుకోవడంతో ఉద్యోగార్థుల్లో ఉత్సాహం కనిపించింది.

"యువతకు ఉద్యోగం.. కుటుంబానికి ఆదాయం.. ప్రాంతానికి అభివృద్ధి" అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ధర్మవరం యువతకు కొత్త ఆశలు కల్పించింది.

మాట ఇచ్చినప్పుడు కార్యక్రమం చేయడం ఒక ఎత్తయితే.. ఆ కార్యక్రమం ద్వారా వేలాది మంది జీవితాల్లో మార్పుకు అవకాశం కల్పించడం మరో ఎత్తు.

గతేడాది 2,000 మందికి పైగా.. ఈసారి 3,000 మందికి పైగా యువతకు అవకాశాలు కల్పించే దిశగా అడుగులు పడటంతో ధర్మవరం ఉద్యోగ అవకాశాల వేదికగా కొత్త గుర్తింపు దిశగా సాగుతోంది.




ఉద్యోగం సాధించిన ప్రతి యువతీ యువకుడి విజయం.. వారి కుటుంబానికే కాదు, ధర్మవరం భవిష్యత్తుకు కూడా బలం.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కు షాక్

**- ఇద్దరికి రూ.20 వేల ఫైన్....**

**- మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారి కి కోర్టు జరిమానా.....**

**ధర్మవరం సెప్టెంబర్ 8 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి ధర్మవరం ద్వితీయ శ్రేణి న్యాయస్థానం రూ.20 వేల జరిమానా విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసులు నమోదు చేసిన కేసులను విచారించిన న్యాయస్థానం.. నిందితులిద్దరికీ చెరో రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. రామగిరి మండలం కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన సంగాల శివయ్య (30)సం, ధర్మవరం పట్టణంలోని సాయినగర్‌కు చెందిన జి. శ్రీరాములు (60) సం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వారిపై కేసులు నమోదు చేశారు. సంగాల శివయ్యపై ఎస్టీసీ నంబర్ 655/2026, జి. శ్రీరాములుపై ఎస్టీసీ నంబర్ 657/2026 కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను ధర్మవరం ద్వితీయ శ్రేణి న్యాయస్థానం విచారించింది. నేరం రుజువు కావడంతో ఇద్దరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. దీంతో ఇద్దరిపై కలిపి మొత్తం రూ.20 వేల జరిమానా పడింది. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని పోలీసులు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



# నేత్రదానం.. ఇద్దరి జీవితాల్లో వెలుగులు

**- జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అవగాహన బైక్ ర్యాలీ......**

**ధర్మవరం సెప్టెంబర్ 8 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం, జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్మవరంలో నేత్రదానం పై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. కదిరిగేటు నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ శివానగర్, తేరుబజార్, అంజుమన్ సర్కిల్, ప్రభుత్వ ఆసుపత్రి, కళాజ్యోతి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, పీఆర్‌టీ సర్కిల్, గాంధీనగర్ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ ర్యాలీని డాక్టర్ ఎస్. నరసింహులు, ఆప్తలమిక్ అధికారి, ఇ. ఉరుకుందప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ.. నేత్రదాన పక్షోత్సవాల ప్రారంభ రోజునే విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో నేత్రదానం చేయించడం అభినందనీయమన్నారు. పక్షోత్సవాల సమయంలో ధర్మవరం ప్రాంతం నుంచి ఐదుగురు నేత్రదానం చేయడం ద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా నేత్రదానాలు చేసిన ప్రాంతంగా ధర్మవరం నిలిచిందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. ఇ. ఉరుకుందప్ప మాట్లాడుతూ.. ప్రతి ఏడాది నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు నేత్రదానంపై చైతన్యం కల్పించడం, కార్నియాల సేకరణలో సంస్థ చేస్తున్న కృషి అమోఘమన్నారు. విశ్వదీప సేవా సంఘం ఫౌండర్ కోల్లమొరం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "అన్ని దానాల్లో నేత్రదానం గొప్పది. ఇది శాశ్వత దానం. ఒకరి మరణం తర్వాత దానం చేసే నేత్రాల ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు" అని పేర్కొన్నారు. రాకబంధు ట్రస్ట్‌కు చెందిన కన్నా వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని, సమాజంలో అంధత్వ నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం అధ్యక్షుడు గాజుల సురేష్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి జుజారు రఘు, మాధవ, ప్రభాకర్ రెడ్డి, శేషు, నాగ, కేశవరెడ్డి, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, ఓబులయ్య, అక్కులప్ప, నాగేశం తదితర సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.




# బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభం

**- ప్రజలకు అందుబాటులో అన్ని రకాల ఆధార్ సేవలు....**

**- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన.....**

**ధర్మవరం సెప్టెంబర్ 8 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణ ప్రజలకు ఆధార్ సేవలను మరింత చేరువ చేసేందుకు కొత్తపేటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీర్ (డి ఈ ) నెనావత్, సబ్ డివిజనల్ ఇంజనీర్ (ఎస్ డి ఈ ) ఉదయ్‌కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆధార్ సేవల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ధర్మవరంలోనే సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, చిరునామా మార్పు లేదా సవరణ, మొబైల్ నంబర్ అనుసంధానం, బయోమెట్రిక్ అప్‌డేట్, వేలిముద్రలు, ఐరిస్, ఫొటో గుర్తింపు తదితర సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని అధికారులు తెలిపారు. ధర్మవరం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆధార్‌లో కొత్త నమోదు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత అసలు గుర్తింపు, చిరునామా ధ్రువపత్రాలతో కొత్తపేటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వచ్చి ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# ఎన్నికల్లో పెన్షన్లపై ఇచ్చిన హామీ నెరవేర్చాలి...!

- 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెన్షన్ హామీని వెంటనే అమలు చేయాలి
- పెన్షన్ దరఖాస్తులకు నిర్దిష్ట గడువును ఎత్తివేయాలి.
- డప్పు, చర్మ కళాకారులు, చేతివృత్తిదారులకు కూడా పెన్షన్ ఇవ్వాలి.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్:**



బత్తలపల్లి మండల డిప్యూటీ ఎంపీడీవో కృష్ణప్ప కి పెన్షన్ లపై వినతిపత్రం సమర్పించిన అనంతరం బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సాకే. వినయ్ కుమార్, నాయకులు సాకే. కుళ్లాయప్ప, మాలవంతం, రాంప్రసాద్ మరియు కళాకారులు,చేతివృత్తిదారులు మాట్లాడుతూ.... ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు, పురుషులందరికీ వెంటనే పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ దరఖాస్తులకు కొద్దిరోజుల గడువు విధించడం సరికాదని, నిర్దిష్ట దరఖాస్తు గడువును పూర్తిగా ఎత్తివేసి అర్హులైన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని సాకే. వినయ్ కుమార్ కోరారు.డప్పు, చర్మ కళాకారులు, కుమ్మరి, చేనేత, కమ్మరి, వడ్రంగి, మేదర, రజకులు, నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, గీత కార్మికులు తదితర సంప్రదాయ వృత్తిదారులను ప్రభుత్వం గుర్తించి పెన్షన్, వృత్తి పరికరాలు, ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. వీరికి స్వీయ ధ్రువీకరణ ఆధారంగా పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ తేదీ నుంచి బకాయిలు చెల్లించాలని, వితంతువులు, వృద్ధుల పెండింగ్ పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. "చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. మాటలు కాకుండా చేతల్లో చూపించాలి. పేదలకు న్యాయం జరిగే వరకు బీఎస్పీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుంది" అని సాకే వినయ్ కుమార్ స్పష్టం చేశారు.

# అర్హులైన చేనేతలకు చేనేత భరోసా అందించాలి....!!

- చేనేత కార్మికులకు నూతన సేవా పథకం వర్తింపజేయండి.
- ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలోని చేనేత కార్మికులకు చాలా మందికి నేతన్న నేస్తం పథకం రాలేదని, రానివారికి వెంటనే వర్తింప చేసేలా చర్యలు గైకొనాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆరోగ్యశాఖ మంత్రి సతీష్ కుమార్ యాదవ్ కు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.....
ధర్మవరం డివిజన్ ప్రాంతంలో మరియు జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం వర్తించలేదని , కూటమి ప్రభుత్వం అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం ద్వారా వారి కుటుంబాలలో మంచి జరగాలని పథకం అమలు చేసినప్పటికీ కొంతమంది నిర్వాహకం వలన అర్హులైన చేనేత కార్మికులకు అన్యాయం జరిగినదని ప్రభుత్వం గుర్తించి అర్హులైన చేనేత కార్మికులకు న్యాయం జరిగాలనే ఉద్దేశంతో రెండో విడతలో దాదాపుగా 33,600 చేనేత కార్మికులను గుర్తించి వారికి పథకం ఆగస్టు 30 తారీఖున అమలు చేస్తామని జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తిరిగి సెప్టెంబర్ 10వ తారీఖు లోపు అందరికి వర్తింప చేసే విధంగా చర్యలు చేపడతామని తెలపడం జరిగినదని, ముఖ్యంగా అర్హులైన చేనేత కార్మికులకు సెప్టెంబర్ 10లోపు అమలు అయ్యేటట్లు మంత్రిగా చొరవ చూపాలని, ధర్మవరం ప్రాంతంలో వినాయక చవితి పండుగ చాలా ఘనంగా చేనేత కార్మికులు జరుపుకుంటారని, కనీసం ఆ పండుగ సందర్భంగా అయినా అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం వర్తింపచేయాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ..... వినాయక చవితి పండుగ లోపు అర్హులైన ప్రతి చేనేత కార్మికుని కి నేతన్న సేవా పథకం వర్తించే విధంగా జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ తో ఫోన్ ద్వారా మాట్లాడి హామీ ఇవ్వడం జరిగినది అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత జిల్లా కన్వీనర్ జె.వి.రమణ చేనేత జిల్లా నాయకులు ఎస్ హెచ్ భాష, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ ఖాదర్ భాషా, గుంపు హరి,చేనేత నాయకులు వి. వెంకటస్వామి,లోకేష్, తిమ్మరాజు ,బండి రామకృష్ణ, బొమ్మ శివ ప్రసాద్ ,అన్నం సూరి, సుధాకర్, గంగప్ప ,తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల వరప్రదాయిని సీఎంఆర్ఎఫ్

- మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్ లో లబ్ధిదారులకు రూ. 38.68 లక్షల విలువైన 85 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్
- నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1177 మందికి రూ. 8.04 కోట్ల లబ్ధి చేకూర్చామని వెల్లడి
- ఆరోగ్యాంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యం..సీఎంఆర్ఎఫ్ తో బాధితులకు ఆర్థిక చేయూత అందిస్తున్నామని పేర్కొన్న మంత్రి దుర్గేష్...కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారులు

**నిడదవోలు సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు ఆర్థిక ఇబ్బందుల వల్ల వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్ లో నియోజకవర్గానికి చెందిన 85 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 38,68,041 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. ఇవాళ 83 మందికి రూ. 33,60,181 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఇద్దరికి రూ. 5,07,860 విలువైన ఎల్వోసీ పత్రాలు అందించామన్నారు."నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా మొత్తం 1177 మంది బాధితులకు రూ. 8,04,75,867 ఆర్థిక లబ్ధి చేకూర్చాం."అని మంత్రి కందుల దుర్గేష్ వివరాలు వెల్లడించారు."ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అర్హులైన నిరుపేదలకు ప్రతి 15 రోజులకు ఒకసారి నిరంతర ప్రక్రియగా ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నాం." అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.తీవ్ర అనారోగ్యం, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం కాకుండా సీఎంఆర్ఎఫ్ భరోసానిస్తోందని, కార్పొరేట్ వైద్యం పేదవాడికి భారం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోంది అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. బాధితుల కళ్ళల్లో నిండిన ఆనంద భాష్పాలే... ఈ ప్రభుత్వ పాలనకు నిజమైన ఆశీస్సులు అని అన్నారు.రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.. కేంద్ర సహకారంతో హెల్ది వెల్ది హ్యాపీ ఆంధ్రప్రదేశ్ కు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు బాటలు వేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న కూటమి ప్రభుత్వంలో సహాయం పొందుతున్న ప్రతి లబ్ధిదారు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.సీఎంఆర్ఎఫ్ పేద ప్రజల వరప్రదాయిని అని, సకాలంలో నిధులు విడుదల చేస్తూ పేదలను ఆదుకుంటున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆపత్కాలంలో తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, స్థానిక శాసన సభ్యులు, మంత్రి కందుల దుర్గేష్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.సెప్టెంబర్ 7వ తేదీ నుండే కొత్త పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయిందని మంత్రి దుర్గేష్ అన్నారు.అర్హులైన పేదలకు విభాగాల వారీగా వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని యజ్ఞంలా తీసుకొని పేద ప్రజలకు అందుబాటులో ఉండి నూతన పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ దిగ్విజయంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.త్వరలోనే ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ ను సూపర్ సక్సెస్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఐటీ కంపెనీల ఏర్పాటు, పర్యాటక రంగ అభివృద్ధి, అమరావతి రాజధాని పునర్నిర్మాణం పనులను వేగవంతం చేశామన్నారు.పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు అందించడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు నీరందించాం. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రకు నీరు అందించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సామాన్య మనిషి దైనందిన జీవితానికి అవసరమైన ప్రతి సదుపాయాన్ని సమకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని కొనియాడారు.ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్, ఇతర ఆర్థిక సహాయ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు.

# మాతృ మరణాల తగ్గింపులో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర..



- మాతృ మరణాలు నివారించేందుకు ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**అనంతపురం, సెప్టెంబర్ 08 :**
**అనంత జనశక్తి న్యూస్**

మాతృ మరణాలు తగ్గింపులో స్వస్తి, ఫాగ్సి, ఆదను లాంటి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి సహకరించడం వల్ల కాన్పు సందర్భంగా జరిగే మాతృ మరణాలు బాగా తగ్గిపోయాయని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యులకు, స్టాఫ్ నర్స్ లకు క్షేమకర కాన్పులు చేయడంపై శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో, ఆసుపత్రిలో ఎన్ని వసతులు ఉన్నా మాతృ సంరక్షణకు అవసరమైన సాంకేతికత లేకపోతే పరిపూర్ణత రాదని చెప్పారు. మాతృ మరణాలు ఎక్కువగా కాన్పు సందర్భంలో జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామస్థాయిలో కూడా ఆరోగ్య సిబ్బందికి మాతృ ఆరోగ్య సంరక్షణకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం అందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు మానవతా దృక్పథంతో, సేవాభావంతో అందిస్తున్నట్లు చెప్పారు. స్వస్తి తమ శిక్షణ సేవలు ప్రైవేట్ రంగానికి, ఆర్డిటి లాంటి స్వచ్ఛంద సంస్థలకు కూడా అందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా.కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్యులు తమ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్వస్తి సాంకేతిక నిపుణులు డా.నాగేంద్ర, ట్రైనింగ్ టీం లీడర్ డా.స్టెఫీ, జిల్లా సమన్వయకర్త విజయ్ కుమార్, ఫ్యాగ్సి సంస్థ శిక్షకులు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ హర్షిత, జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భూ హక్కులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ.



**గాండ్లపెంట, సెప్టెంబర్ ,8, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిధిలోని తుమ్మలబైలు రెవెన్యూ గ్రామంలో 'మీ భూమి -మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు 448 పట్టాదారు పాస్‌పుస్తకాలను మంగళవారం తహసీల్దార్ నరసింహులు పంపిణీ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పాస్‌పుస్తకాల్లో రైతు ఫోటో, పేరు, చిరునామా, కులం, ఆధార్, సర్వే నంబర్, భూమి విస్తీర్ణం, భూమి స్కెచ్ తో పాటు క్యూఆర్ కోడ్, రాజముద్రను పొందుపరిచినట్లు తెలిపారు. భూమికి సంబంధించిన హక్కులు, వివరాలను భద్రంగా ఉంచుకునేందుకు పాస్‌పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు
ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ బాబురావు, ఆర్ఐ జాఫర్, వీఆర్వోలు క్రిష్టప్ప, రమణ, అమినుల్లా, రామమోహన్, వీఎస్‌లు పుష్ప, అనురాధ, రైతులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్, మీట్‌లో సత్తా చాటిన జిల్లా పోలీసులు.



- 17 పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులు....

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 08 అనంత జన శక్తి న్యూస్**

గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, విట్ యూనివర్సిటీలలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్ , డ్యూటీ మీట్లో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 17 పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన 23 మంది పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ క్రీడాంశాల్లో పాల్గొని 3 బంగారు, 3 వెండి, 11 కాంస్య పతకాలు సాధించారు.వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్ , కబడ్డీ, ఫుట్ బాల్, కోకో, యోగా, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం, 4×400 మీటర్ల రిలే తదితర క్రీడాంశాల్లో శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, తమ చాంబర్‌లో పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను అభినందించారు.క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు.జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన పోలీసు క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.అనంతరం అడిషనల్ ఎస్పీ అంకిత సురాన తన చాంబర్లో కలిసిన క్రీడాకారులను అభినందించారు.పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు:గోరంట్ల సీఐ శేఖర్ - కబడ్డీలో కాంస్య పతకం. ఏఆర్ ఆర్ఎస్ఐ వీరన్న - క్రికెట్ , కోకోలో , వెండి,కాంస్య పతకం. సంజీవ రాయుడు, మురళీమోహన్, సంజప్ప, రాంప్రసాద్, ఈశ్వర్, వీరానాయక్ - కోకో పోటీలలో కాంస్య పతకాలు.గోవిందు - ఫుట్ బాల్‌లో కాంస్య పతకం. ప్రసాద్ - 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం పోటీలలో బంగారు పతకాలు.పద్మశ్రీ - పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం, బ్యాడ్మింటన్‌లో వెండి పతకం, 4×400 మీటర్ల రిలేలో వెండి పతకం. మంజమ్మ - యోగాలో వెండి, కాంస్య పతకాలు సాధించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శేఖర్, శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఐ వీరన్న, పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

# అక్షరాస్యతతోనే అభివృద్ధి బాట..

**గాండ్లపెంట, సెప్టెంబర్,8, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అక్షరాస్యత ప్రాధాన్యత, విద్య ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చదువు ప్రతి ఒక్కరి హక్కు అని, నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ కృష్ణానాయక్, ఏపీఎం సూర్యనారాయణ, ఏపీఓ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పాఠశాల వయస్సు పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్లేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.వయోజనులు సైతం అక్షరాస్యతను పెంపొందించుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ప్రజా సేవలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ హక్కులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు అక్షరాస్యత పెరిగినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, విద్య ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి చేరేలా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ కృష్ణానాయక్, ఏపీఎం సూర్యనారాయణ, ఏపీఓ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు...



# మండలంలో విస్తృతంగా పర్యటించిన జాయింట్ కలెక్టర్

**రాయదుర్గం సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్**

గుమ్మగట్ట మండలంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ విస్తృతంగా పర్యటించారు. మంగళవారం గుమ్మగట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలో 6వదశ కింద చేపట్టిన రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రీసర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని, గడువులోపు అన్ని పనులను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టును జాయింట్ కలెక్టర్ పరిశీలించి బిటి ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలను అధికారులతో జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తదనంతరం గుమ్మగట్ట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పురోగతి, రీసర్వే పనులు, మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం, తదిదర అంశాలపై తహసిల్దార్, అధికారులతో సమీక్ష చేసి వేగవంతంగా దరఖాస్తులను పరిష్కారం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఆర్ ఐ రామాంజనేయులు, విజయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన 'ఉత్తమ ఉపాధ్యాయురాలు' నిచ్చెనకొళ్ల కృష్ణకుమారి



**- నిడదవోలు క్యాంపు కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయురాలు కృష్ణకుమారికి మంత్రి కందుల దుర్గేష్ ఘన సత్కారం**
**- విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయడం అభినందనీయం: మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు సెప్టెంబర్ 08 అనంత జనశక్తి న్యూస్**

ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికైన నిడదవోలు మండలం డి.ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ నిచ్చెనకొళ్ల కృష్ణకుమారిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఘనంగా సత్కరించారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుండి అవార్డు స్వీకరించిన కృష్ణకుమారి మంగళవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు ప్రభుత్వం ప్రదానం చేసిన జ్ఞాపిక (షీల్డ్)ను, ప్రశంసాపత్రాన్ని మంత్రికి చూపించగా, ఆయన ఆమెను శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... గడిచిన 24 సంవత్సరాలుగా విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తూ, విద్యార్థులతో మమేకం అవుతూ విభిన్న బోధనా శైలితో విధులు నిర్వర్తించిన ప్రతి పాఠశాలలోనూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు, విద్యార్థుల సమగ్ర వికాసానికి కృష్ణకుమారి చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా సత్కారం పొందడం పట్ల కృష్ణకుమారి తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ధర్నాల పేరుతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు

**- మూడు గంటల కరెంటంటూ తప్పడు ప్రచారం సరికాదు**
**- టీడీపీ హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప**

**రాప్తాడు సెప్టెంబర్ 8 అనంత జనశక్తి న్యూస్**



రైతుల కోసం ధర్నాలు చేస్తున్నానంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇప్పుడు హడావుడి చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప విమర్శించారు. నీ సొంత గ్రామమైన తోపుదుర్తిలో ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారని, నియోజకవర్గంలోని పలు మండలాల్లోనూ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతుల కోసం ఇలాంటి సబ్‌స్టేషన్లు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో ప్రకాష్‌రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**మూడు గంటల కరెంటంటూ ప్రచారమా**

రైతులకు కేవలం మూడు గంటలే విద్యుత్ సరఫరా చేస్తున్నారంటూ ప్రకాష్‌రెడ్డి చేస్తున్న ప్రచారం వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందని ముత్యాలప్ప అన్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు, అంతరాయాలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్యలను పరిష్కరించకుండా రైతులను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు.

**రైతు ప్రయోజనమే లక్ష్యం**

రైతు ప్రయోజనమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముత్యాలప్ప స్పష్టం చేశారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎక్కడైనా తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే దానిని పెద్ద సమస్యగా చిత్రీకరించడం తగదన్నారు. రైతుల పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

**రాజకీయాలకు రైతు సమస్యలు వాడొద్దు**

అమరావతి పేరుతో ప్రతి సమస్యను రాజకీయానికి ముడిపెట్టడం మానుకోవాలని ముత్యాలప్ప హితవు పలికారు. రాజధాని అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ రైతుల విద్యుత్ సమస్యను ముడిపెట్టడం రాజకీయ విమర్శల కోసమేనని అన్నారు. ధర్నాల పేరుతో రాజకీయ ప్రచారం చేసుకోవడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ముత్యాలప్ప పేర్కొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలు పోతుల వరలక్ష్మీ ఘన సన్మానం

**యాడికి, సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న నంబర్ 4 ప్రాథమిక పాఠశాల యందు పని చేస్తున్న పోతుల వరలక్ష్మీని మంగళవారం ఉపాధ్యాయుల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును అందుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాధికారులు కాసేప్ప, సీతారామాంజనేయులు హాజరయ్యారు .ఈ సందర్భంగా మండల విద్యాధికారులు కాసేప్ప, సీతారామాంజనేయులు మాట్లాడుతూ మన మండలము నకు చెందిన టీచర్ వరలక్ష్మి కి జిల్లా ఉత్తమ టీచర్ గా ఎంపిక కావడం మన మండల విద్యా శాఖ కు గొప్ప గర్వకారణం అని కొనియాడారు. అంతే గాక ప్రతి రోజు విద్య బోధనలతో పాటు ప్రత్యేకంగా వారానికి ఒక రోజు స్కౌట్ కార్యక్రమం నిర్వహించి, విద్యార్థి దశ నుండే మంచి క్రమశిక్షణ, సహాయం, సేవాభావాలు పెంపొందే విధంగా మంచి కార్యక్రమం ఎంపిక చేశారు అని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరలక్ష్మి నీ ముందుగా మండల విద్యాధికారులు , ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శైలజకుమారి, రవీంద్ర, పద్మావతి, రంగస్వామి రెడ్డి, నాగలక్ష్మి, సర్వేశ్వర రెడ్డి, బ్రహ్మయ్య, ఖాదర్ వలి, ప్రతిభ రాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




# పినకోట పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమం

**- ఆశా కార్యకర్తల పనితీరుపై సమీక్ష.. సెప్టెంబర్ నెల యాక్షన్ ప్లాన్‌పై దిశానిర్దేశం**

**అనంతగిరి,జన శక్తి న్యూస్,సెప్టెంబర్ 8:**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్.చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో అందిస్తున్న ఆరోగ్య సేవలు,గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలు, విధుల అమలు తీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను చేరువ చేయడంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని డాక్టర్ చైతన్య తెలిపారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తదితరులకు అందించాల్సిన ఆరోగ్య సేవలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలపై ఉందని వివరించారు.గత నెలలో ప్రతి ఆశా కార్యకర్త తన పరిధిలో నిర్వహించిన ఆరోగ్య కార్యక్రమాలు, ఇంటింటి పర్యటనలు, ప్రజలకు అందించిన సేవలు, ఆరోగ్య సమస్యల గుర్తింపు, సంబంధిత వివరాల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు.

**సెప్టెంబర్ నెలకు యాక్షన్ ప్లాన్**

సెప్టెంబర్ నెలలో ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై డాక్టర్ చైతన్య ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని
ఎప్పటికప్పుడు గమనిస్తూ, అనుమానిత వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన సమయంలో వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలు, ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఆశా కార్యకర్త తన పరిధిలోని గ్రామాల్లో ముందస్తు ప్రణాళికతో పనిచేసి ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలని సూచించారు.

**లెప్రసీ సర్వేపై శిక్షణ**

ఇదే కార్యక్రమంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న లెప్రసీ (కుష్ఠు వ్యాధి) సర్వేపై ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం, అనుమానితులను
గుర్తించి వైద్య పరీక్షలకు పంపించడం, వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా చూడటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.లెప్రసీ సర్వేను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. సర్వేలో గుర్తించిన అనుమానిత కేసులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు.ఈ సర్వే కార్యక్రమం విజయవంతం కావాలంటే వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ చైతన్య సూచించారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని, తమకు కేటాయించిన
బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.ఆశా డే సందర్భంగా ఆరోగ్య కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయి సమస్యలు, లెప్రసీ సర్వే నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

**- ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన – సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి**
**- అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 08:అనంత జనశక్తి న్యూస్**



శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం సాయంత్రం జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఆయా కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ –2026పై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2026లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రతికూల వార్తలపై తక్షణ స్పందన**

ప్రజా సమస్యలకు సంబంధించిన ప్రతికూల వార్తలు పత్రికలు, మీడియాలో వచ్చిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి**

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రాథమిక ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

**తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు**

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి పారిశుధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

**పీఎం సూర్య ఘర్, గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి**

పీఎం సూర్య ఘర్ పథకం అమలును మరింత ప్రోత్సహించాలని, అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పేదల గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.

**SIR–2026, iGOT కర్మయోగి వినియోగం**

SIR-2026 ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే సిబ్బంది నైపుణ్యాభివృద్ధి, ఈలెర్నింగ్ కోసం 'iGOT కర్మయోగి' పోర్టల్‌ను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ, డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్‌పీడీసీఎల్, మెప్మా, డీఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖ అధికారులు, డీఈఓ, ఎంఈఓలు, ఐసీడీఎస్ సిబ్బంది, కేజీబీవీ/ఎస్సీ/ఎస్టీ/బీసీ హాస్టల్ కోఆర్డినేటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికీ అందడమే ప్రభుత్వ లక్ష్యం

**- మంత్రి కందుల దుర్గేష్**
**- నూతన పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియపై నిడదవోలు నియోజకవర్గ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష**
**- ఈ నెల 16 వరకు నూతన పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ..పెన్షన్ అప్లికేషన్లు వెనక్కి పంపొద్దు.. రిజెక్ట్ చేస్తే కారణం చెప్పాల్సిందే.. పత్రాలు తక్షణమే లేకపోయినా పేదల నుండి పెన్షన్ దరఖాస్తులను స్వీకరించాలి**
**- ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగొద్దు – అర్హులందరికీ పెన్షన్లు అందేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దుర్గేష్ స్పష్టమైన దిశానిర్దేశం**

**నిడదవోలు సెప్టెంబర్ 08 అనంత జనశక్తి న్యూస్**



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని.. అధికారులు ఆ దిశగా జవాబుదారీతనంతో వ్యవహరించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు రోటరీ క్లబ్ హాల్‌లో నిడదవోలు మున్సిపాలిటీ, నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి దుర్గేష్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేదవాడికి సామాజిక పెన్షన్లు అందేలా అధికారులు సమర్థవంతంగా పని చేయాలని మంత్రి కందుల దుర్గేష్ కీలక సూచనలు చేశారు.నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే పేద ప్రజల వద్ద కొన్ని పత్రాలు తక్షణమే లేకపోయినప్పటికీ వారి అప్లికేషన్లను మానవతా దృక్పథంతో స్వీకరించాలని, భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే ఈ దరఖాస్తులు ఉపయోగపడతాయన్నారు. నిర్దేశిత నిబంధనలు (పారామీటర్స్) చేరుకోలేదనే నెపంతో దరఖాస్తులను వెంటనే డిస్‌కనెక్ట్ చేయడం లేదా వెనక్కి పంపడం చేయకూడదని తెలిపారు. చిన్న చిన్న లోపాలు ఉన్నా సానుకూలంగా పరిశీలించాలని సూచించారు.ఒకవేళ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉండి అప్లికేషన్‌ను తిరస్కరించాల్సి వస్తే దానికి గల కచ్చితమైన కారణాన్ని దరఖాస్తుదారునికి స్పష్టంగా వివరించాలని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న లేదా సాంకేతిక సడలింపులు అవసరమైన దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లు నోట్ చేసుకోవాలని చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం నుండి ఏదైనా సడలింపు వస్తే సంబంధిత అప్లికేషన్స్ పరిశీలించి వాటిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి లబ్ధి చేకూర్చాలన్నారు.ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు.గత ప్రభుత్వం అర్హులకు పెన్షన్లు ఎగ్గొట్టి అనర్హులకు ఇచ్చిందనే ఆవేదన ప్రజల్లో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే స్పౌజ్ పెన్షన్లను మంజూరు చేశామని, తాజాగా నూతన పెన్షన్ల దరఖాస్తు స్వీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ సెప్టెంబర్ 16వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని, స్వర్ణ గ్రామీణ, వార్డు సచివాలయాల ద్వారా నూతన పెన్షన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ప్రధానంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత మరియు చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులు, ట్రాన్స్ జెండర్లలో అర్హులైన కొత్త లబ్ధిదారులందరికీ 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు అందుతాయని వెల్లడించారు.సచివాలయాల్లోనే సంబంధిత వీఆర్వోలు తక్షణమే అర్హులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో లబ్ధిదారులకు వచ్చే సందేహాలను అధికారులు వెంటనే నివృత్తి చేయాలని, సమయం పరిమితంగా ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇంటి పన్ను నిబంధనను తొలగించే విషయమై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పెన్షన్ల విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా తన వద్దకు వచ్చిన 161 దరఖాస్తులను పిజిఆర్ఎస్ ద్వారా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించామన్నారు.కొత్త పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియపై సమాచారం లేని నిరుపేదలకు అధికారులు అవగాహన కల్పించాలని, ఎక్కడా డూప్లికేషన్ కాకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు ప్రస్తావించిన పలు సాంకేతిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల పరిష్కరిస్తానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. నిడదవోలు నియోజకవర్గంలో ఏ ఒక్క అర్హుడు కూడా పెన్షన్ అందలేదని ఆవేదన చెందకూడదని, క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే అధికారులు నేరుగా తన మొబైల్ నంబరుకు ఫోన్ చేసి మాట్లాడవచ్చని తన నంబర్‌ను అధికారులకు తెలిపారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికే ఇవాళ అధికారులతో ఓరియెంటేషన్ నిర్వహించామన్నారు.ఈ సమీక్షా సమావేశంలో నిడదవోలు మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్, నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, డిజిటల్/వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు

**- పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులకు నిధుల కోసం విజ్ఞప్తి**
**- భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలన్న ఎమ్మెల్యేలు**
**- సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు**

**విజయవాడ సెప్టెంబర్ 08, అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రత్యేకంగా కలిశారు. పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టుల కాలువల కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం మంజూరు, కాలువలు, లిఫ్ట్ లు ఏర్పాటు కోసం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమం తర్వాత వారు ముఖ్యమంత్రితో భేటి అయ్యారు. 2018లో జి.ఒ.నెంబర్ 59 ద్వారా, 803 కోట్ల 96 లక్షల 67 వేల రూపాయల నిధులతో అప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్ట్ కు నీరు అందించే పనులు మంజూరు చేశారని ఈ సందర్భంగా సునీత వివరించారు. 4 లిఫ్ట్ లతో పాటు 54 కిలోమీటర్లు కాలువ నిర్మాణం మరియు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించాలని కోరగా, పరిటాల రవీంద్ర సాగునీటి పథకం పేరుతో పనులు ప్రారంభించామన్నారు. 3నియోజకవర్గాల పరిధిలో సుమారు 2 వేల ఎకరాల భూమి అవసరం కాగా మనపై నమ్మకంతో రైతులు ఎలాంటి పరిహారం పొందక మునుపే సుమారు వెయ్యి ఎకరాల భూములు ఇచ్చారన్నారు. 2018-19 సం.లో కేవలం 95 ఎకరాలకు 5.20 కోట్ల రూపాయలు మాత్రమే రైతుల ఖాతాలోకి జమ చేయడం జరిగింది. మిగిలిన 915 ఎకరాలకు ఆనాటి ధరల ప్రకారం 50.75 కోట్లు ఇంకా చెల్లించవలసి ఉందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ఆ రైతులకు ఎలాంటి పరిహారం అందకపోగా పంటలను కూడా కోల్పోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న ఇతర ప్రాజెక్ట్ లకు 2025సం, మార్చి 30వ తేదిన సుమారుగా 45 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ కు 55 కోట్లకు గాను కేవలం 2 కోట్ల రూపాయల మాత్రమే చెల్లించామన్నారు. దాదాపుగా 53 కోట్ల రూపాయలకు సంబంధించిన నష్ట పరిహారం అందక రైతులు అసంతృప్తితో ఉన్నారని వివరించారు. రైతులకు పరిహారం ఇవ్వడంతో పాటు ప్రాజెక్ట్ పనులు కూడా త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భైరవానితిప్ప కింద పెండింగ్ లో ఉన్న పనులు, రైతులకు ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. దీని పై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రైతులకు పరిహారం ఇచ్చేలా ఆదేశాలిస్తామన్నారు. రెండు ప్రాజెక్టులను మనం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యేలు సునీత, సురేంద్రబాబు తెలిపారు...

# అనంతగిరిలో ప్రిన్సిపల్ సెక్రెటరీ సూర్యకుమారి ఆకస్మిక తనిఖీలు

**అనంతగిరి, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలంలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. సూర్యకుమారి మంగళవారం పర్యటించి కాశీపట్నం, అనంతగిరి 1 అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను పరిశీలించారు.ఏఐ ఆధారిత బాల్య వికాస స్క్రీనింగ్, పిల్లల బరువు, ఎత్తు వివరాల నమోదును పరిశీలించారు. తల్లులతో మాట్లాడి పౌష్టికాహారం నాణ్యత, ప్రభుత్వ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





# పినకోట పీహెచ్‌సీలో ఆశా డే

**అనంతగిరి, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఆశా కార్యకర్తల పనితీరు, గత నెలలో చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు.సెప్టెంబర్ నెలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనుమానిత వ్యాధి లక్షణాలను గుర్తించి వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సెప్టెంబర్ 1 నుంచి 24 వరకు నిర్వహించే కుష్ఠు వ్యాధి సర్వేపై ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి అనుమానిత కేసులను గుర్తించి వైద్య పరీక్షలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్



**యాడికి, సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ని మంగళవారం రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ బి. వి. రావు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశా లతో రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ బి. వి. రావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు గురించి చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్యక్రమం ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ అమలు పైలట్ ప్రాజెక్టు గురించి వైద్యాధికారులు పరమేశ్వర్, సాయి సుమంత్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు . రోగుల నమోదు, వైద్య చరిత్ర నమోదు చేసి, దీర్ఘ కాలిక సమస్యలను ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డులను పరిశీలించారు.ప్రాథమిక స్థాయిలో డిజిటల్ ఆరోగ్య సేవల అమలును మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు.
ల్యాబ్లో రికార్డు లను ,మందులు రికార్డ్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ఎబిడిఎం, ఉమాశంకర్ సీనియర్ డైరెక్టర్ స్వస్తి ,సుధీర్ స్టేట్ లీడర్ పాత్ , మహేష్ కుమార్ పీఎంవో స్టేట్ లీడర్, శివ కిషోర్ స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ స్వస్తి, శ్యామ్ ఏకాకేర్ మేనేజర్ బెంగుళూరు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబంది పాల్గొన్నారు.

# సంస్కృతి కళాశాల చోరీ కేసు ఛేదన

**- ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్.. రూ.12 లక్షలు స్వాధీనం**

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

బ్రహ్మణపల్లిలోని సంస్కృతి కళాశాలలో జరిగిన రూ.17.45 లక్షల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో గుజరాత్, బీహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రూ.12 లక్షల నగదు, వాచ్, ఉంగరం, బ్యాగ్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎన్. సత్యనారాయణ తెలిపారు.జులై 24న కళాశాల అకౌంట్స్ విభాగంలో అల్మారా పగులగొట్టి రూ.17,45,450 నగదు దొంగిలించారు. దర్యాప్తులో భాగంగా అలెక్స్ మనోహర్ పవార్, కాజురామ్, అజయ్ చౌహాన్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు చోరీ నగదులో 69 శాతం మేర రూ.12 లక్షలు రికవరీ చేసినట్లు వెల్లడించారు.కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, డీఎస్పీ ఎన్. సత్యనారాయణ అభినందించారు.



# యల్లనూరులో బాల్య వివాహాల జోరు....

**యల్లనూరు, సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్ ;**

యల్లనూరు గ్రామంలో బాల్యవివాహాలు జోరుగా సాగుతున్నాయి. 15,16సంవత్సరాల వయసులోనే పెళ్లిళ్లు జరుగుతుండటం విశేషం. కొందరు ప్రేమ పేరుతో, మరికొందరు పెద్దల సమక్షంలోనే బాల్య వివాహాలు జరిపేస్తున్నాయి. గత 15 రోజుల క్రితం ఇద్దరు మైనర్లు ప్రేమ పేరుతో వెళ్లిపోయి పెళ్లి చేసుకోగా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఇరువురిని పిలిపించి ఎవరి ఇళ్లకు వారిని పంపించేశారు. మరోమారు అదే విధంగా వ్యవహరించడంతో సదరు యువకుడిని పోలీసులు అదుపులో ఉంచుకున్నారు. అలాగే మరో అమ్మాయిని కూడా ప్రేమ పేరుతో మరో యువకుడు తీసుకెళ్లి పెళ్లి చేసుకోవడంతో ఆ యువతి తండ్రి ఈ బాల్య వివాహాలపై చలించి కేసు నమోదు చేయాలంటూ పోలీసులతో గట్టిగా వాదించారు. మరో బాల్య వివాహం కూడా యల్లనూరులోనే జరగడం విశేషం. ఇలా వరుస బాల్య వివాహాలు జరుగుతున్న అధికారుల్లో ఏ మాత్రం చలనం లేకపోవడం విశేషం.
15 రోజులు వ్యవదిలోనే యల్లనూరులో వరుసగా మూడు బాల్య వివాహాలు జరిగితే అధికారులకు తెలియదా....? తెలిసిన మాకేలా అన్న రీతిలో ఉన్నారా....? అయితే విషయం తెలిసిన అంగన్వాడి సూపర్ వైజర్ ఇక్కడ అందరి అధికారులకు బాధ్యత



ఉంది, మాకు ఒక్కటే కాదంటూ సమాధానం ఇవ్వడం శోచనీయం..

**కరువైన అవగాహన....**

బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం వివిధ రూపాల్లో అధికారుల వ్యవస్థను నియమించడం జరిగింది. వీరు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను విద్యార్థి దశలో పిల్లలకు, గ్రామాలలో ప్రజలకు, తల్లి దండ్రులకు అవగాహన కల్పించి బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో నివారించాలి. అయితే ఈ ప్రాంత ప్రజలకు బాల్య వివాహ చట్టాలపై అవగాహన లేకనే ఇలా చిన్న వయసులోనే పెళ్లిళ్లు జరిగిపోతున్నారేమో మరి. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాతనే పెళ్లిళ్లు జరపాలన్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశం.

**ఈ చట్టానికి వేసే శిక్షలు**

బాల్య వివాహాలు చేయడం, వాటిని ప్రోత్సహించడం, లేదా ఆ వివాహ వేడుకలను నిర్వహించడం చట్టప్రకారం తీవ్రమైన నేరం. ఈ నేరానికి పాల్పడిన వారికి 2 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష మరియు రూ. 1 లక్ష వరకు జరిమానా విధించవచ్చు. మహిళలకు జైలు శిక్ష నుండి మినహాయింపు ఉంటుంది

**చట్టం అమలు చేసేది ఎవరు...?**

బాల్య వివాహాలను అడ్డుకోవడానికి మరియు ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం వివిధ స్థాయిలలో అధికారులను నియమించింది. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ కు ఈ చట్టాన్ని పర్యవేక్షించే ప్రధాన బాధ్యత అయనదే. అలాగే జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, మహిళా శిశు సంక్షేమ అధికారి బాల్య వివాహలకు వ్యతిరేకంగా ఈ అధికారులు పనిచేయాల్సిన ఉంది. వీరు కోర్టుల ద్వారా వివాహాలను నిలిపివేయడానికి స్టే ఆర్డర్లును కూడ తీసుకురావచ్చు. సీడీపీఓలు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో బాల్య వివాహాల సమాచారాన్ని సేకరించి, వాటిని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషిస్తారు.

**మండల తహసీల్దార్లు...**

మండల పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే స్పందించి, పోలీసుల సహాయంతో పెళ్లిని ఆపే అధికారం వీరికి ఉంటుంది. అలాగే స్థానిక పోలీస్ అధికారులు కూడ బాల్య వివాహాల నిరోధంలో అధికారులకు రక్షణ కల్పించడం మరియు నిందితులపై కేసులు నమోదు చేయడం వీరి బాధ్యత. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో వివాహాల వయస్సును ధృవీకరించడం, బాల్య వివాహాల సమాచారాన్ని పై అధికారులకు చేరవేయడం వీరి విధి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో బాలికల వివరాలను పర్యవేక్షిస్తూ, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ రావడంతో మహిళా పోలీసులు కూడా ఇందులో కీలక బాధ్యత ఉంటుంది

# ఉత్తమ అవార్డు గ్రహీత కు సన్మానం

**- ఉత్తమఅవార్డు గ్రహీత జగదీష్ కుమార్ ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు**

**అమడగూరు సెప్టెంబర్ 8 అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు మండలంలోని జెకేపల్లి పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తు ఉత్తమ అవార్డు పొందిన జగదీష్ కుమార్, ను మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉత్తమ అవార్డు గ్రహీత జగదీష్ కుమార్ కు పూలమాలలు వేసి దుశ్యలవతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సుధీర్ కుమార్, దివాకర్ రెడ్డి, వెంకటరమణ నాయక్, లీలావతి, వెంకటలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన సీపీఎం

**- రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలి**

**అమడగూరు, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్, పట్రవాండ్లపల్లి, తిమిరీకుంటపల్లి, సంగీతంపల్లి, కసంద్రం పంచాయతీల్లో సీపీఎం నాయకులు పర్యటించి ఎండిపోతున్న పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు వీవీ రమణ మాట్లాడుతూ వర్షాలు లేక బోర్లు ఎండిపోవడంతో తిమిరీకుంటపల్లిలో సుమారు 50 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. మండలం మొత్తం కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు పెట్టుబడులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి వెంటనే పరిహారం, సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అమడగూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతుల రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. పశువులకు మేత, తాగునీరు అందించాలని, పాలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప పాల్గొన్నారు.



# విశిష్ట మహిళా ఇంజనీర్ అవార్డు కు ప్రొఫెసర్ వైశాలి జి. ఘోర్పడే ఎంపిక

**జేఎన్టీయూ సెప్టెంబర్ 8 (అనంత జనశక్తి)**



జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కి మరో ప్రతిష్టాత్మక గౌరవం లభించింది. విశిష్ట సివిల్ ఇంజనీరింగ్ విద్యావేత్త, పరిశోధకురాలు, విద్యా నిర్వాహకురాలు, సంస్థాగత నాయకురాలు ప్రొఫెసర్ డాక్టర్ వైశాలి జి. ఘోర్పడేను ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్రం ప్రతిష్టాత్మక విశిష్ట మహిళా ఇంజనీర్ అవార్డు-2026కు ఎంపిక చేసింది. ఈ అవార్డు 59వ ఇంజనీర్స్ డే అవార్డులు-2026లో భాగంగా అందించనున్నారు. డాక్టర్ వైశాలి జి. ఘోర్పడే విద్యా నైపుణ్యం, పరిశోధనా ప్రతిభ, ఇంజనీరింగ్ రంగంలో విశిష్ట సేవలు, పరిపాలనా నాయకత్వం, సంస్థాగత అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం పట్ల నిబద్ధతకు ఈ గౌరవం ప్రతీకగా నిలుస్తుంది. ఆమె ఎంపిక జేఎన్టీయూకు గర్వకారణమే కాకుండా, దేశవ్యాప్తంగా మహిళా ఇంజనీర్లు యువతరానికి స్ఫూర్తిదాయకమైన విజయంగా నిలుస్తుంది.
ఫోటో: వైశాలి జి. ఘోర్పడే

# మట్టి గణపతిని చేద్దాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం




**- మట్టి గణపతి పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**

**- ప్రకృతిని ప్రేమిద్దాం.. మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 08:అనంత జనశక్తి న్యూస్**

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు మంగళవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన “మట్టి గణపతిని చేద్దాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం” పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు.పర్యావణానికి హాని కలిగించని మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు.“మట్టి గణపతినే పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి – మీకు నా ఆశీస్సులు. ప్రకృతిని ప్రేమిద్దాం.. మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం” అని కలెక్టర్ ప్రజలకు సందేశం ఇచ్చారు.వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా నిర్వహించాలని, విగ్రహాల నిమజ్జనం సమయంలో కాలుష్య నియంత్రణ మండలి సూచించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎఇ శశికళ, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీసాముండలో అసంపూర్తి పాఠశాల భవనం

**- తాగునీటి కోసం ప్రజల అవస్థలు.. సమస్యలు పరిష్కరించాలి: జడ్పీటీసీ గంగరాజు**

**అనంతగిరి, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం కొండిబ పంచాయతీ పరిధిలోని సీసాముండ గ్రామంలో పాఠశాల భవనం అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ దీసరి గంగరాజు తెలిపారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన ఆయన పాఠశాల భవనంతో పాటు తాగునీటి సమస్యను పరిశీలించారు.నాడు–నేడు రెండో విడత నిధులతో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టిన పాఠశాల భవనం పనులుi పూర్తికాకపోవడంతో సుమారు 30 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిధులు మంజూరైనా పనులు ఎందుకు పూర్తికాలేదో సమగ్రంగా విచారణ జరిపి, భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు, 250 మంది నివసిస్తున్నప్పటికీ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గ్రావిటీ పథకం ద్వారా నీరు సక్రమంగా అందకపోవడంతో పాటు బోర్లు పనిచేయడం లేదని తెలిపారు. దీంతో మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుక్మంధనరావు దృష్టికి తీసుకెళ్లినట్లు గంగరాజు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గ్రామ ప్రజల కనీస అవసరాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి టోకురు, తాజా మాజీ సర్పంచ్ కిల్లో మోస్య, సీసాముండ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్ర అప్పన్న, అప్పలస్వామి, లక్ష్మణ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



-50 ఏళ్లకే పెన్షన్ హామీ ఏమైంది..?

-మేనిఫెస్టోలో ముద్రించిన మాటలు.. అమలులో ఎందుకింత నిశ్శబ్దం..?

-ఎస్సీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ హామీపై అర్హుల ఎదురుచూపులు.

-కల్లుగీత నుంచి చేనేత వరకు.. వృత్తి ఆధారిత కార్మికులకు హామీ ఎప్పుడు అమలు?

-క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి త్రికరణ శుద్ధితో అమలు చేయాలని డిమాండ్

# ఓట్ల వేళ హామీలు.. గెలిచాక గాలికి..?

**ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ప్రజలకు భరోసా కల్పిస్తాయి.. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే హామీల అమలుకు ప్రజలు ఎదురు చూడాల్సి వస్తే ఆ హామీలకు అర్ధమేంటి..? ఎన్నికల మేనిఫెస్టోలో 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పుడు క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఓటు అడిగే సమయంలో మాట ఇచ్చి, ఓట్లు వేసి గెలిపించిన తర్వాత ఆ మాట అమలు కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.**





**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**

**సెప్టెంబర్ 8, అనంత జనశక్తి న్యూస్:**

ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీ ఆయా వర్గాల్లో ఆశలు కలిగించింది. వయసు పెరిగే కొద్దీ శారీరకంగా కష్టపడే సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా తగ్గుతుంటాయి. అలాంటి సమయంలో ప్రభుత్వం అందించే పెన్షన్ వారికి ఎంతో కీలకమైన సామాజిక భద్రతగా నిలుస్తుంది. అందుకే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కేవలం ప్రచార హామీగా కాకుండా ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేయాలనే డిమాండ్ క్షేత్రస్థాయి నుంచి వినిపిస్తోంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారి వయసు, వృత్తి, సామాజిక వర్గం తదితర వివరాలను పరిశీలించి పారదర్శకంగా పెన్షన్ మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

**వృత్తి కార్మికుల పరిస్థితి ఏమిటి?**

కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, చేనేత కార్మికులు వంటి వర్గాలు తమ సంప్రదాయ వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. వృత్తుల్లో మార్పులు, ఆదాయంలో హెచ్చుతగ్గులు, పెరుగుతున్న జీవన వ్యయాల మధ్య వృద్ధాప్య దశకు చేరుకుంటున్న వారికి సామాజిక భద్రత ఎంతో అవసరం.ఇలాంటి వర్గాలకు 50 సంవత్సరాలు పైబడిన అర్హులను గుర్తించి పెన్షన్ అందించాలనే హామీ అమలుకు వస్తే వేలాది కుటుంబాలకు ఊరట లభించే అవకాశం ఉంది. అయితే హామీ అమలు విషయంలో స్పష్టమైన కార్యాచరణ, అర్హుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ, పెన్షన్ మంజూరు ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

**చేనేత కార్మికులకు గుర్తింపు పత్రమే కీలకం**

చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలకు 50 ఏళ్ల తర్వాత ఆర్థిక భద్రత మరింత అవసరం. పెన్షన్‌కు అర్హత సాధించేందుకు చేనేత గుర్తింపు పత్రం వంటి ఆధారాలను పరిగణనలోకి తీసుకునే విధానం ఉండటంతో నిజమైన చేనేత కార్మికులను గుర్తించడం సాధ్యమవుతుంది. అయితే గుర్తింపు పత్రాలు ఉన్నప్పటికీ అర్హత కలిగిన వారికి ప్రయోజనం అందకపోతే ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉంది. కాగితాలపై ఉన్న నిబంధనలు ప్రజల జీవితాల్లో ప్రయోజనాలుగా మారినప్పుడే సంక్షేమానికి నిజమైన అర్థం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**డ్రామా కళాకారులకూ భరోసా ఎప్పుడు?**

డ్రామా కళాకారులు, డప్పు కళాకారులు వంటి సంప్రదాయ కళలను నమ్ముకుని జీవించే వారికి స్థిరమైన ఆదాయం ఉండటం చాలా సందర్భాల్లో కష్టమే. ప్రభుత్వం గుర్తించిన కళాకారుల సంఘం లేదా సంబంధిత సంస్థ ద్వారా పొందిన గుర్తింపు పత్రాల ఆధారంగా అర్హతను పరిశీలించి పెన్షన్ అందించే విధానం అమలు చేయాలని కళాకారులు కోరుతున్నారు. కళలను కాపాడుతున్న వారిని గుర్తించడం కేవలం సన్మానాలకు పరిమితం కాకుండా వారి జీవితాలకు సామాజిక భద్రత కల్పించే దిశగా ఉండాలని వారు ఆశిస్తున్నారు.

**ఒంటరి మహిళల విషయంలోనూ స్పష్టత అవసరం**

ఒంటరి మహిళలకు కూడా 50 సంవత్సరాల వయస్సు ప్రాతిపదికగా పెన్షన్ కల్పించాలనే అంశం ఉంది. ఇందుకోసం ఎమ్మార్వో సర్టిఫికెట్‌తో పాటు కోర్టు ద్వారా పొందిన విడాకుల పత్రాలను సమర్పించే నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.అర్హత పత్రాలు సమర్పించిన మహిళలకు ఎటువంటి జాప్యం లేకుండా దరఖాస్తులను పరిశీలించి, నిజమైన అర్హులను గుర్తించి పెన్షన్ మంజూరు చేయాలని కోరుతున్నారు. కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు ప్రభుత్వం అందించే పెన్షన్ ఒక చిన్న మొత్తంగా కనిపించినా వారి జీవితాల్లో మాత్రం అది భరోసాకు పెద్ద ఆధారం కావచ్చు.

**క్షేత్రస్థాయి సర్వేతో అసలు అర్హులు బయటకు**

ఎన్నికల హామీని అమలు చేయాలంటే ముందుగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో 50 ఏళ్లు పైబడిన అర్హులను గుర్తించి వారి వృత్తి, సామాజిక వర్గం, గుర్తింపు పత్రాలు తదితర వివరాలను పరిశీలిస్తే అసలు లబ్ధిదారుల సంఖ్యపై స్పష్టత వస్తుంది.రాజకీయ సిఫారసులు, వ్యక్తిగత పరిచయాలకు తావులేకుండా త్రికరణ శుద్ధితో అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడంలో అధికార యంత్రాంగం కూడా చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉంది.

**హామీకి జవాబు చెప్పాల్సిన సమయం ఇదేనా?**

ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు కేవలం ఓటర్లను ఆకట్టుకునే వాగ్దానాలుగా మిగిలిపోకుండా, అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాచరణగా మారాలి. ముఖ్యంగా 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలు నేరుగా పేద, మధ్యతరగతి, వృత్తి ఆధారిత కుటుంబాల జీవన భద్రతతో ముడిపడి ఉన్నాయి.

ఓట్ల కోసం ఇచ్చిన మాట.. ఓట్లు పడిన తర్వాత మరచిపోయే మాట కాకూడదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని త్రికరణ శుద్ధితో అమలు చేసి అర్హుల జీవితాల్లో భరోసా నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకే క్షేత్రస్థాయి నుంచి ఒకటే ప్రశ్న వినిపిస్తోంది——

"50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారు?"










## పించన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి: బీజేపీ




**అమడగూరు, సెప్టెంబర్ 8:అనంత జనశక్తి న్యూస్**

కొత్త పింఛన్ల దరఖాస్తుల గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని అమడగూరు మండల బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సచివాలయాల్లో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా చింత శరత్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 16 వరకు మాత్రమే గడువు ఇవ్వడంతో అర్హులు అవసరమైన ధ్రువ పత్రాలు సిద్ధం చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వర్ సమస్యల కారణంగా కూడా దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించి అర్హులందరికీ అవకాశం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిశెట్టి వేమన, బీజేపీ కిసాన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇందుకూరి సురేందర్‌రెడ్డి, నాయకులు మేకల శ్రీనివాసులు, దేశాయ్ జైచంద్రారెడ్డి, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీత కు సన్మానం

**- ఉత్తమ,అవార్డు గ్రహీత ఎం ప్రసన్నలక్ష్మి,ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు**

**Wఅమడగూరు మండలంలోని తుమ్మల,పాఠశాలలో ఉపాధ్యాయురాలు గా పనిచేస్తు ఉత్తమ అవార్డు పొందిన ఎం ప్రసన్నలక్ష్మి, ను మంగళవారం ఎంఈఓ జిలాన్ భాష ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు తుమ్మల,పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉత్తమ అవార్డు గ్రహీత ఎం ప్రసన్నలక్ష్మి,కు బిజెపి అధ్యక్షుడు రామిశెట్టి వేమనారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి దుశ్యలవతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో, పిల్లలకు భోజనం వ్యవస్థ ఆల్ ఆల్ టీచర్స్ అందరికి భోజనం ఏర్పాట్లు చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్కూల్ సిబ్బంది, పాల్గొన్నారు**



## శ్రీవారి సేవలో శతాబ్దాలుగా
# ప్రత్యేకత చాటుకున్న అరుదైన జీవి..

**- జనారణ్యంలో ప్రత్యక్షంపై ఆసక్తికర చర్చ**

**మంగళగిరి సెప్టెంబర్ 08 అనంత జనశక్తి న్యూస్**



అది మామూలు అడవి జంతువు కాదు. కనిపిస్తే చాలామందికి వెంటనే గుర్తుపట్టడం కూడా కష్టం. కానీ ఆలయ సంప్రదాయాల్లో దానికి ఉన్న స్థానం మాత్రం ఎంతో ప్రత్యేకం. అలాంటి అరుదైన పునుగుపిల్లి మంగళగిరి కొండపై కనిపించిందన్న వార్త ఇప్పుడు భక్తుల్లో, స్థానికుల్లో ఆసక్తిని రేపుతోంది.శనివారం పానకాల నరసింహస్వామి కొండపైకి వెళ్తున్న భక్తుల కంటపడిన ఈ జీవి కొద్దిసేపు అక్కడ సంచరించినట్లు తెలుస్తోంది.సాధారణంగా దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల్లో సంచరించే పునుగుపిల్లి పట్టణానికి ఆనుకుని ఉన్న మంగళగిరి కొండపై కనిపించడం సహజంగానే అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే అక్కడ కనిపించింది పునుగుపిల్లేనా...? లేక దాన్ని పోలిన మరో జీవినా...? అనే ప్రశ్నకు అటవీశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

**అడవుల్లోని జీవి.. ఆలయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం**

పునుగుపిల్లి పేరు వినగానే చాలామందికి ముందుగా గుర్తుకొచ్చేది తిరుమల శ్రీవారి ఆలయ సంప్రదాయమే. ఈ చిన్న వన్యప్రాణి నుంచి లభించే సుగంధ పదార్థంతో తయారయ్యే తైలానికి శతాబ్దాలుగా ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది.పునుగుపిల్లి శరీరంలోని తోకకు సమీపంలో ఉన్న ప్రత్యేక గ్రంథుల నుంచి స్రవించే సుగంధ ద్రవాన్ని సేకరిస్తారు. అది గాలికి ఆరిన తర్వాత మైనంలాంటి పదార్థంగా మారుతుంది. దీనిని నువ్వుల నూనె, కస్తూరి, పచ్చకర్పూరం తదితర సుగంధ ద్రవ్యాలతో కలిపి ప్రత్యేకమైన తైలాన్ని తయారు చేస్తారు.తిరుమలలో ప్రతి శుక్రవారం జరిగే అభిషేక సేవ అనంతరం మూలవిరాట్‌కు ఈ తైలాన్ని లేపనంగా ఉపయోగించే సంప్రదాయం కొనసాగుతోంది. స్వామివారి విగ్రహానికి నిగారింపు, పరిరక్షణ కల్పించడంతో పాటు దివ్య తేజస్సును ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. ఒక చిన్న వన్యప్రాణి.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఆరాధించే శ్రీవారి సేవలో భాగం కావడం వెనుక ఉన్న సంప్రదాయమే పునుగుపిల్లికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

**శతాబ్దాల నాటి ఆనవాళ్లు**

పునుగుపిల్లి తైల వినియోగం కొత్తగా ఏర్పడిన ఆచారం కాదు. దక్షిణ భారతదేశంలోని ప్రాచీన ఆలయ సంప్రదాయాల్లో దీనికి సంబంధించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. తిరుమలలో మాత్రం ఇది ప్రత్యేకమైన ఆగమ సంప్రదాయంగా కొనసాగుతున్నట్లు చెబుతారు. కాలం మారినా ఆచారం మాత్రం కొనసాగుతుండటంతో పునుగుపిల్లి పేరు ఆలయ సేవలతో ముడిపడిపోయింది.అయితే ఇదే సమయంలో మరో అంశం కూడా ముఖ్యమైంది. పునుగుపిల్లి సాధారణంగా కనిపించే జంతువు కాదు. వన్యప్రాణి సంరక్షణ చట్టం పరిధిలో రక్షణ పొందుతున్న అరుదైన జీవి కావడంతో దాని సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

**రక్షణే ముఖ్యం..**

పునుగుపిల్లి కనిపించిందన్న ఆసక్తితో దాని వద్దకు వెళ్లడం, పట్టుకునేందుకు ప్రయత్నించడం, తరలించడం వంటివి చేయకూడదు. అది నిజంగా పునుగుపిల్లే అయితే అటవీశాఖ అధికారులే దాని పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.శ్రీవారి సేవలో ఉపయోగించే తైలానికి అవసరమైన పదార్థం అందుబాటులో ఉండేలా తిరుమల తిరుపతి దేవస్థానం పునుగుపిల్లుల సంరక్షణకు చర్యలు చేపడుతోంది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో వీటి సంరక్షణకు ఏర్పాట్లు ఉన్నాయి.

**మంగళగిరి కొండపైకి ఎలా వచ్చింది...?**

**ఇప్పుడు అందరి ఆసక్తి ఒక్క ప్రశ్నపైనే ఉంది.**

**అడవుల్లో సంచరించే అరుదైన జీవి మంగళగిరి కొండపైకి ఎలా వచ్చింది. ....?**

మంగళగిరి కొండ ప్రాంతంలో సహజసిద్ధమైన రాళ్ల ప్రాంతాలు, పొదలు, చెట్లతో కూడిన ఆవాసాలు ఉన్నాయి. అలాంటి వాతావరణం వన్యజీవులకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. అయితే కనిపించిన జీవి పునుగుపిల్లేనని అధికారిక నిర్ధారణ లేకుండా ఏ నిర్ణయానికీ రావడం సరికాదు.అటవీశాఖ అధికారులు పరిశీలించి జాతిని నిర్ధారిస్తే ఈ ఆసక్తికర ఘటనకు స్పష్టత వస్తుంది. నిజంగానే పునుగుపిల్లి అయితే

మాత్రం మంగళగిరి కొండ జీవ వైవిధ్యంపై మరోసారి అందరి దృష్టినీ మళ్లించే అరుదైన ఘటనగా ఇది నిలిచే అవకాశం ఉంది.ఒకవైపు పానకాల నరసింహస్వామి కొండ ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుండగా.. మరోవైపు అదే కొండపై అరుదైన వన్యజీవి కనిపించిందన్న సమాచారం ప్రకృతి ప్రేమికుల్లోనూ ఆసక్తి కలిగిస్తోంది. భక్తుల రాకపోకల మధ్య కొండపైకి వచ్చిన ఈ 'అడవి అతిథి' నిజంగా పునుగుపిల్లేనా...? అన్నది ఇప్పుడు అటవీశాఖ నిర్ధారణ కోసం ఎదురుచూస్తున్న ప్రశ్న.

## అసత్యాలపై సత్యమే గెలుస్తుంది

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సభకు పెద్ద ఎత్తున హాజరైన గుజరాత్ యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'ఇటీవలే వడోదర, ముంబై మధ్య డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభమైంది. ఈ రైలు ద్వారా ఒక్క ట్రిప్‌లో 250 ట్రక్కులకు సమానమైన సరకును తరలించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కూడా కొందరు ఎంట్రీ ఇచ్చి విమర్శలు గుప్పిస్తారు. ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తారు. ట్రక్కుల పరిస్థితి ఏమిటని అంటారు. వాళ్లకు గొణిగేందుకు మరో అంశం దొరికినట్టే' అని ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. 2014కు ముందు సరకు రవాణా ప్రత్యేక కారిడార్ నిర్మాణం కిలోమీటరు మేర కూడా ముందుకు సాగలేదని విమర్శించారు.

యువత ఆకాంక్షలు, గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించాలని చూసేవారు మన ప్రయాణంలో ప్రతి మలుపు వద్దా కనిపిస్తారని, కానీ భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని చెప్పారు. దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 'Chhatron Ki Goonj' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న సంగతి తెలిసిందే. దానిని ఉద్దేశించే మోదీ విమర్శలు చేశారు. గుజరాత్ లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

''దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్ట్రర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశకూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి'' అని యూపీఏ పాలనపై మోదీ ధ్వజమెత్తారు. 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము మాత్రం 50వేల రైలు కోచ్‌లను నిర్మించామని వెల్లడించారు.

అనంతరం యువత గురించి మాట్లాడిన ప్రధాని.. ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. ''ఇప్పుడు ఎన్నో కుటుంబాలు ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి'' అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

**ధురంధర్ పాటతో మోదీకి స్వాగతం..**

**'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మోదీ వస్తుండగా.. వేదికపైన ధురంధర్ సినిమాలోని 'Aari Aari', క్వీన్ చిత్రంలోని 'We Will Rock You' పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానిని ఘనంగా స్వాగతించారు.**

# గుండెను కాపాడే టాప్ 7 ఆహార పదార్థాలు: కార్డియాలజిస్ట్ వెల్లడించిన జాబితా ఇదే



ఆరోగ్యకరమైన ఆహారం గుండె జబ్బులు, గుండెపోటు రాకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీ ఆహారంలో పండ్లు, చిరుధాన్యాలు (మిల్లెట్స్) వంటి కొన్ని పదార్థాలు చేర్చుకుంటే, గుండె జబ్బులు వచ్చే రిస్క్ చాలా వరకు తగ్గిపోతుంది. విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్. సందీప్, ఇచ్చిన ఇంటర్వ్యూలో, గుండె ఆరోగ్యానికి తీసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.



గుండెకు మేలు చేసే ఆహారం ఎందుకు ముఖ్యం?

డాక్టర్ సందీప్ ఏమన్నారంటే, "ప్రస్తుతం మన దేశంలో మరణాలకు గుండె జబ్బులు ప్రధాన కారణాల్లో ఒకటిగా మారాయి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లే గుండె జబ్బులు పెరగడానికి ముఖ్యమైన రిస్క్ ఫ్యాక్టర్స్‌గా తేలింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, గుండెకు మంచి చేసే ఆహారం తీసుకోవడం గుండె జబ్బులు రాకుండా నివారించడంలో చాలా కీలక పాత్ర పోషిస్తుందని ఎన్నో అధ్యయనాలు చెప్పాయి." అని వివరించారు.

పట్టణీకరణ, ఆధునిక జీవనశైలితో ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగం పెరిగిందని, ఇది దీర్ఘకాలంలో గుండెపై నెగెటివ్ ప్రభావాన్ని చూపుతుందని డాక్టర్ సందీప్ చెప్పారు. "మన సాంప్రదాయ ఆహారపు పద్ధతులను మళ్ళీ పాటిస్తూ, వాటిని ఆధునిక



పోషకాహార శాస్త్ర సూత్రాలతో కలిపితే, దీర్ఘకాలికంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు" అని డాక్టర్ సందీప్ అన్నారు.

జాతీయ, అంతర్జాతీయ మార్గదర్శకాలు ఈ కింది ఆహారాలను గుండెను కాపాడే అగ్రశ్రేణి ఆహారాలుగా గుర్తించినట్టు డాక్టర్ తెలిపారు.

1. మిల్లెట్స్ (చిరుధాన్యాలు)

"రాగి, జొన్నలు, సజ్జలు వంటి కొన్ని చిరుధాన్యాలను సూపర్ ఫుడ్స్‌గా చూస్తారు. వీటిని డయాబెటిస్, గుండె జబ్బుల రోగులు కూడా తినొచ్చు. ఈ ఆహారాల్లో పోషకాలు ఎక్కువగా, ఫైబర్ నిండుగా ఉంటాయి. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇవి రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్‌ను కంట్రోల్ చేయడంలో సహాయపడతాయి. ఇవే గుండె జబ్బులకు దారితీసే రెండు ప్రధాన రిస్క్ ఫ్యాక్టర్స్" అని ఆయన చెప్పారు.

2. ఆకుకూరలు

"పాలకూర, మెంతి వంటి ఆకుకూరల్లో పొటాషియం, నైట్రేట్లు వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా





ఉంటాయి. ఈ పోషకాలు ధమనుల పనితీరును మెరుగుపరుస్తాయి. అలాగే, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి.." అని డాక్టర్ వివరించారు.

3. నట్స్ (గింజలు)

"బాదం, వాల్‌నట్స్ వంటి గింజల్లో ఒమేగా-3 ఫ్యాట్స్, ప్లాంట్ స్టెరాల్స్ ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ గుప్పెడు గింజలు తినడం వల్ల మీ శరీరంలో (మంచి కొలెస్ట్రాల్) పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఇది ధమనుల్లో ప్లేక్ ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది గుండె జబ్బులకు మరో పెద్ద కారణం." అని డాక్టర్ సందీప్ తెలిపారు.

4. కోల్డ్-ప్రెస్డ్ నూనెలు

"ఆవాలు, వేరుశనగ వంటి కోల్డ్-ప్రెస్డ్ నూనెలు రసాయన ద్రావకాలు, అధిక వేడితో తక్కువగా ప్రాసెస్ అవుతాయి. ఈ నూనెల్లో ప్రాసెస్ చేయని విటమిన్లు, మంచి కొవ్వులు ఉంటాయి. సమతుల్య ఆహారంలో భాగంగా, ఈ నూనెలు గుండెకు మేలు చేసే, అసంతృప్త కొవ్వులను అందిస్తాయి.." అని డాక్టర్ సందీప్ తెలిపారు.

5. పప్పుధాన్యాలు

"పప్పుధాన్యాల్లో మొక్కల ఆధారిత ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. బరువు నియంత్రణకు కూడా ఇవి ఉపయోగపడతాయి. శనగలు, రాజ్మా, పెసర, బీన్స్, బఠానీలు, పప్పులు వంటివి పప్పుధాన్యాలకు మంచి ఉదాహరణలు" అని ఆయన చెప్పారు.

6. తాజా పండ్లు

"జామ, ఉసిరి, దానిమ్మ వంటి తాజా, సీజనల్ పండ్లను మీ ఆహారంలో చేర్చుకోండి. ఇవి యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి కి మంచి వనరులు. ఇవి గుండెపై ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గిస్తాయి" అని డాక్టర్ సందీప్ అన్నారు.

# లేబుల్ జాగ్రత్తగా చదవండి: సన్‌స్క్రీన్లలో దాగి ఉన్న ప్రమాదాల గురించి కార్డియాలజిస్ట్ హెచ్చరిక



సూర్యరశ్మి నుండి రక్షణ విషయానికి వస్తే, షెల్ఫ్ నుండి ఏ సన్‌స్క్రీన్ పడితే అది తీసుకుంటే సరిపోదు. చాలా ఉత్పత్తులు బ్రాడ్-స్పెక్ట్రమ్ రక్షణ, ఎస్‌పీఎఫ్ ప్రయోజనాలను అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ, అన్ని ఫార్ములేషన్లు ఒకేలా ఉండవు. కొన్నింటిలో ఆరోగ్య సమస్యలను పెంచే పదార్థాలు కూడా ఉండవచ్చు. చర్మాన్ని నిజంగా హాని నుండి కాపాడటానికి ఏం చూడాలి, ఏమి నివారించాలో కార్డియాలజిస్ట్, ఫంక్షనల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ అలోక్ చోప్రా జూన్ 6న తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరించారు.








సన్‌స్క్రీన్లలో ఎలాంటి పదార్థాలను నివారించాలి?

"అన్ని సన్‌స్క్రీన్లు ఒకేలా ఉండవు. కొన్నింటిలో మీ చర్మానికి నచ్చని రహస్య రసాయనాలు ఉంటాయి. తెలివిగా ఎంచుకోండి. లేబుల్ చదవండి. మీ చర్మాన్ని సరైన మార్గంలో రక్షించుకోండి" అని డాక్టర్ అలోక్ చోప్రా క్యాప్షన్‌లో రాశారు.

"మీ సన్‌స్క్రీన్ మీ హార్మోన్లకు నిశ్శబ్దంగా హాని కలిగించవచ్చు. చాలా వాణిజ్య సన్‌స్క్రీన్లలో ఎండోక్రైన్ డిస్రప్టర్స్, క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలు నిండి ఉంటాయి. మీరు వాటిని మీ చర్మానికి అప్లై చేసినప్పుడు, అవి మీ రక్తప్రవాహంలో కలిసిపోతాయి. కాబట్టి, సన్‌స్క్రీన్ కొనే ముందు, మీరు దానిలో ఉండే పదార్థాలను జాగ్రత్తగా చదవాలి." అని హెచ్చరించారు.

హానికరమైన పదార్థాల జాబితాను వివరించారు. "ఆక్సిబెంజోన్, మెథాక్సీసిన్నమేట్ లేదా అవోబెంజోన్ వంటివి కనిపిస్తే దానిని కొనవద్దు. ఇవి ఎండోక్రైన్ డిస్రప్టర్స్, అంటే ఇవి మీ శరీర హార్మోన్ల సమతుల్యతకు అంతరాయం కలిగిస్తాయి. అలాగే, లేబుల్‌పై 'ఫ్రాగ్రెన్స్' అని ఉంటే, దానిని నివారించండి. ఆ ఒక్క పదం థాలేట్స్ మరియు పారాబెన్స్ వంటి రసాయనాల కలయికను దాచిపెట్టగలదు. ఇవి రెండూ హార్మోన్లను దెబ్బతీస్తాయి. దీర్ఘకాలిక ఆరోగ్య ప్రమాదాలతో ముడిపడి ఉన్నాయి..' అని వివరించారు.

చర్మానికి సురక్షితమైన, మంచి సన్‌స్క్రీన్లు ఏవి?

డాక్టర్ చోప్రా జింక్ ఆక్సైడ్ లేదా టైటానియం డయాక్సైడ్ వంటి పదార్థాలతో కూడిన మినరల్ ఆధారిత సన్‌స్క్రీన్లను ఎంచుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. "ఇవి రక్తప్రవాహంలోకి శోషితమవకుండా చర్మం పైభాగంలో ఉంటాయి..' అని వివరించారు.

సరైన ఫేషియల్ సన్‌స్క్రీన్‌ను ఎంచుకోవడం యొక్క ప్రాముఖ్యతను ఆయన మరింత నొక్కి చెప్పారు. "ముఖానికి వాడే సన్‌స్క్రీన్ల విషయానికి వస్తే, తెలివిగా ఎంచుకోవడం ఇంకా ముఖ్యం. ముఖ చర్మం మృదువుగా ఉంటుంది. ఎక్కువ శోషిస్తుంది. తరచుగా సూర్యరశ్మికి గురవుతుంది. అంటే మీ సన్‌స్క్రీన్‌లోని ఏవైనా విష పదార్థాలు మీ రక్తప్రవాహంలోకి త్వరగా చేరతాయి. చాలా వాణిజ్య ఫేస్ సన్‌స్క్రీన్లు తేలికైనవి లేదా జిడ్డు లేనివిగా మార్కెట్ అవుతుంటాయి. కానీ వాటిలో ఇప్పటికీ అదే హానికరమైన రసాయనాలు ఉంటాయి. బదులుగా, 'నాన్-కోమెడోజెనిక్' అని లేబుల్ చేసిన మినరల్ సన్‌స్క్రీన్ల కోసం చూడండి. అంటే అవి మీ రంధ్రాలను అడ్డుకోవని అర్థం. వాటిలో ఫ్రాగ్రెన్స్, పారాబెన్స్ మరియు సిలికాన్లు కూడా ఉండకూడదు." అని సూచించారు.

"దీన్ని గుర్తుంచుకోండి. మీరు మీ చర్మంపై పూసే క్రీములు మీ నోటిలో వేసుకునే దానిలాగే మీ జీర్ణవ్యవస్థకు హాని కలిగించవచ్చు. జాగ్రత్తగా ఎంచుకోండి. మీ హార్మోన్ ఆరోగ్యం దానిపై ఆధారపడి ఉంటుంది" అని డాక్టర్ చోప్రా ముగించారు.



# విజయ్‌తో సినిమా.. త్రిష నుంచి వచ్చిన మెసేజ్ ఇదే: మాళవిక మోహనన్




ఇండస్ట్రీలో త్రిష లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు నటి మాళవిక మోహనన్. కొత్త వాళ్లను ఆమె ఎంతో ప్రోత్సహిస్తారని తెలిపారు. 'సర్దార్ 2' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ త్రిషతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'పేట' సినిమాలో ఆమెతో కలిసి వర్క్ చేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఆమె తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని తెలిపారు.

"నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో 'పేట' అవకాశం వచ్చింది. రజనీకాంత్ సినిమా కావడంతో ఎంతో ఆనందించా. కానీ, కమర్షియల్ సినిమా చేసిన అనుభవం లేకపోవడంతో కంగారుపడ్డాను. వారణాసిలో షూటింగ్ జరిగిన వేళ త్రిషతో కలిసి కొన్ని కాంబినేషన్ సీన్లలో నటించాను. అప్పుడే తనతో పరిచయం ఏర్పడింది. ఎంతో బాగా చూసుకున్నారు. ప్రతి విషయంలోనూ నన్ను భాగం చేసేవారు. పరిశ్రమలో చాలా మంది ఎవరి పని వారు చేసుకొని వెళ్లిపోతారు. కానీ, త్రిష కొత్తవారిపై కూడా ఆదరణ చూపిస్తారు. చాలా తక్కువ మంది మాత్రమే అలా చేయగలరు".

"ఆ తర్వాత విజయ్‌కు జోడీగా నాకు 'మాస్టర్' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిష స్పెషల్ మెసేజ్ పంపారు. 'బేబీ నీకు ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. అలా అభినందించడానికి పెద్ద మనసు కావాలి" అంటూ త్రిషపై మాళవిక ప్రశంసలు కురిపించారు. కెరీర్ కీలక మలుపు తిరిగే సమయంలోనూ త్రిష ఇచ్చిన ప్రోత్సాహం తనకెంతో ప్రత్యేకమని అన్నారు. 2021లో విడుదలైన 'మాస్టర్' విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఇక మాళవిక నటించిన తాజా చిత్రం 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది

# 'టాక్సిక్' కోసం భారీ ప్రాజెక్ట్ వదులుకున్న యశ్!



యశ్‌కు ఇండియానా జోన్స్ లాంటి అడ్వెంచర్ కథ వినిపించానని.. కానీ, అది పట్టాలెక్కలేదని దర్శకుడు పీఎస్ మిత్రన్ తెలిపారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో.. యశ్‌కు వినిపించిన కథ గురించి పంచుకున్నారు.

"యశ్ నేను ప్రతిష్ఠాత్మక కథ వినిపించా. చాలా బలమైన ఎమోషన్స్ ఉన్నాయి. ఇండియానా జోన్స్ లాంటి అడ్వెంచర్ స్టోరీ. నా డ్రీమ్ ప్రాజెక్ట్. అది రూపొందించి ఉంటే చాలా అద్భుతంగా ఉండేది. కానీ, అప్పుడు యశ్‌కు సమయంలేక దాన్ని వదులుకున్నారు. దీంతో అది నెరేషన్ దగ్గరే ఆగిపోయింది" అని చెప్పారు. అడల్ట్ కంటెంట్‌తో కూడిన ఎమోషన్స్‌లేని గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నటించడం కంటే.. భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న అడ్వెంచర్ సినిమా ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేదని పీఎస్ మిత్రన్ అభిప్రాయపడ్డారు.

**యశ్ టాక్సిక్.. ఓటీటీ డీల్‌లోనూ నిరాశే..**

ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన 'టాక్సిక్' అభిమానులను నిరాశపర్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్‌పై రకరకాల వార్తలు వస్తున్నాయి. గతంలో ఈ సినిమా రైట్స్‌ను రూ.150కోట్లకు దక్కించుకొనేందుకు ప్రయత్నించిన ఓ సంస్థ ఇప్పుడు రూ.30కోట్లు మాత్రమే ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం . సినిమా భారీ హిట్ అవుతుందని భావించిన చిత్రబృందం రూ.150కోట్ల డీల్‌ను అప్పుడు ఓకే చేయలేదని.. రూ.200కోట్లు డిమాండ్ చేసిందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# గ్రామీణ నేపథ్యంలో హారర్ కథ



ఎస్ఆర్ కళ్యాణ మండపం' చిత్రంతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు శ్రీధర్ గాదె. ఇప్పుడాయన 'కమిటీ కుర్రోళ్ళు' ఫేమ్ ఈశ్వర్ రాచిరాజు హీరోగా ఓ కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. వెంకట్ తలారి నిర్మాత. నందిత, లిఖిత కథానాయికలు. పూజిత పొన్నాడ, సింధు కాసారం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు కోదండ రామిరెడ్డి క్లాప్ కొట్టి.. దర్శక నిర్మాతలకు స్క్రిప్ట్ అందించారు. దర్శకుడు వీరభద్రం చౌదరి కెమెరా స్విచ్చాన్ చేశారు. "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే హారర్ సినిమా. సరికొత్త కథ, కథనాలతో ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించనుంది. మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సాయి కార్తీక్, ఛాయాగ్రహణం: సతీశ్ రెడ్డి మాసం.

# కొత్త చిత్రానికి శ్రీకారం



"బలమైన భావోద్వేగాలతో నిండిన రొమాంటిక్ డ్రామా 'ఎల్‌యూబీ'" అన్నారు దర్శకుడు మణికంఠ పెదమల్లు. ఆయన దర్శకత్వం నుంచి వస్తున్న ఈ తొలి చిత్రంలో పవన్ కేసరి, ప్రాముఖ్య జంటగా నటిస్తున్నారు. మహేశ్ కుమార్ సంక, భగవాన్ నిర్మిస్తున్నారు. అభితేజ్, జేడీవీ ప్రసాద్, సాయి కిరణ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి బీవీఎస్ రవి క్లాప్ కొట్టగా.. చైతన్య రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. మణికంఠ గౌరవ దర్శకత్వం వహించారు. బి.జగన్ మోహన్ రెడ్డి, బీవీఎస్ రవి స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా హీరో పవన్ కేసరి మాట్లాడుతూ.. "ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో నిండిన రోమ్ కామ్ ఇది. చాలా మంచి కథతో ముస్తాబవుతోంది. కచ్చితంగా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో రోహిత్ కేపీ, సముద్ర, లగడపాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణంపై శీతల్ గురి



: భారత్‌లో తొలిసారిగా జరుగుతున్న ప్రపంచ పారా ఆర్చరీ సిరీస్‌లో స్టార్ అథ్లెట్, కాంపౌండ్ పారా ప్రపంచ ఛాంపియన్ శీతల్ దేవి అంచనాలకు తగ్గ ప్రదర్శనే చేస్తోంది. ఆమె మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణంపై గురి పెట్టింది. సెమీఫైనల్లో శీతల్ 145-143తో భారత్‌కే చెందిన సరితపై విజయం సాధించింది. ఫైనల్లో ఆమె ఐజాదా సీడన్ (కజకిస్థాన్)తో తలపడనుంది. సరిత కాంస్యం కోసం వాంగ్ హ్యుటింగ్ (చైనా)తో పోటీ పడనుంది. ఇంకా పలు విభాగాల్లో భారత్‌కు పతకాలు ఖాయమయ్యాయి. డబ్ల్యూ-1 మహిళల విభాగంలో తన్వి ప్రవీణ్ రజతం సాధించింది. ఆమె ఫైనల్లో 4-6తో క్రిస్టోస్ మిసోస్ (సైప్రస్) చేతిలో ఓటమి పాలైంది. డబ్ల్యూ-1 పురుషుల విభాగంలో యుగళ్ గార్గ్ కాంస్యం నెగ్గాడు. ఈ పతక పోరులో అతను భారత్‌కే చెందిన పవన్ కుమార్‌పై నెగ్గాడు. పురుషుల రికర్వ్ విభాగం సెమీస్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి 5-1తో జియా లీ-జు వెంజాన్ (చైనా) ద్వయంపై నెగ్గి ఫైనల్లో అడుగు పెట్టారు. మహిళల రికర్వ్‌లో భావన-పూజ జోడీ కూడా స్వర్ణ పోరుకు అర్హత సాధించింది. ఈ జంట 6-2తో ఇరాన్ క్రీడాకారులను ఓడించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీం విభాగంలో భావన-హర్విందర్ 6-0తో ఇండోనేసియా జంటను ఓడించి ఫైనల్ చేరింది. పురుషుల కాంపౌండ్ విభాగంలో శ్యామ్ సుందర్-తోమన్ కుమార్ ద్వయం 154-153తో బవో యిరుయ్-ఫెంగ్ యూ (చైనా) జంటను ఓడించి ఫైనల్లో అడుగుపెట్టింది. కాంపౌండ్ మహిళలల్లో శీతల్ దేవి, పాయల్ నాగ్ జోడీ సెమీఫైనల్లో ఓడి కాంస్యం కోసం బరిలో నిలిచింది. డబ్ల్యూ-1 మహిళల విభాగంలో స్వాతి చౌదరి కాంస్యం కోసం పోటీ పడనుంది. ఆమె సెమీస్‌లో 1-7తో లియు జింగ్ (చైనా) చేతిలో ఓటమి పాలైంది. కాంపౌండ్ పురుషుల విభాగంలో ప్రపంచ ఛాంపియన్ తమన్ కుమార్ సెమీస్‌లో 144-146తో కెన్ స్వాగుమిలాంగ్ (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. అతనూ కాంస్యం కోసం తలపడనున్నాడు. మరో భారత కాంపౌండ్ ఆర్చర్ గుర్విందర్ సింగ్ క్వార్టర్స్‌లో 141-143తో స్వాగుమిలాంగ్ చేతిలో ఓడి పతకానికి దూరమయ్యాడు. డబ్ల్యూ-1 పురుషుల విభాగంలో భారత ఆర్చర్లు అడిల్ నజీర్, నూరుద్దీన్ క్వార్టర్స్‌లో పరాజయం పాలయ్యారు.

# దులీప్ ట్రోఫీ ఫైనల్.. మూడో రోజూ ఈస్ట్ జోన్‌దే జోరు



సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో మొదటి రెండ్రోజులు బ్యాట్‌తో అదరగొట్టిన ఈస్ట్ జోన్.. మూడో రోజు బౌలింగ్‌లోనూ సత్తాచాటింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (270; 334 బంతుల్లో) భారీ డబుల్ సెంచరీకితోడు మిగతా బ్యాటర్లూ రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం, మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన సౌత్ జోన్ తడబడుతోంది. ఏ ఒక్క బ్యాటర్ కూడా భారీ స్కోరు చేయకపోవడంతో ఆట ముగిసే సమయానికి 242/6 స్కోరుతో నిలిచింది.

కెప్టెన్ తిలక్ వర్మ (56*) అర్ధ శతకం చేయగా.. అతడితోపాటు చామ మిలింద్ (2*) క్రీజులో ఉన్నాడు. ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62; 104 బంతుల్లో 4 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేసినా దాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. నారాయణ్ జగదీశన్ (32), షేక్ రషీద్ (27), శ్రేయస్ గోపాల్ (26), స్మరన్ రవిచంద్రన్ (23) పరుగులు చేశారు. ఓపెనర్ రికీ భుయ్ (1) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో మహ్మద్ షమి, ముకేశ్ కుమార్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. శిఖర్ మోహన్, ఎండీ కౌనైన్ ఖురేషీకి ఒక్కో వికెట్ దక్కింది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలిన ఉన్న మ్యాచ్‌లో ప్రస్తుతం సౌత్ జోన్ 466 పరుగుల వెనుకంజలో ఉంది.

## పాక్‌కు షాకిచ్చిన అఫ్గాన్ క్రికెట్ బోర్డ్..

భారత్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఓ ప్రచార వీడియో రూపొందించింది. ఇందులో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ గిల్గిట్-బల్టిస్థాన్‌లను భారత్‌లో భాగంగా చూపింది. దీంతో ఇరుదేశాల మధ్య కొత్త దౌత్యపరమైన వివాదానికి తెరలేచింది. ఆ మ్యాప్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు .. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్యలకు దిగలేదు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని చూస్తోంది. సరిహద్దు ఘర్షణలు, వైమానిక దాడులతో అఫ్గాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న తరుణంలో ఈ తాజా వివాదం తలెత్తింది. దేశంలో జరుగుతోన్న దాడులకు కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తున్న తెహ్రిక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్‌కు అఫ్గాన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అఫ్గాన్, భారత్ మధ్య సెప్టెంబరు 13 నుంచి దిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తోంది.

# మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదేమో.. పాక్‌కు టీమ్‌ఇండియా ఫ్యాన్స్ కౌంటర్

మహిళల ఆసియా కప్ లో భారత్ చేతిలో ఘోర ఓటమి చవిచూసినా.. పాకిస్థాన్ సెమీ ఫైనల్స్‌కు చేరింది. సోమవారం దుబాయ్‌లో తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో హాంకాంగ్, చైనాను పాక్ 72 పరుగుల తేడాతో ఓడించి సెమీస్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ వహాబ్ రియాజ్ స్టేడియంలో ఉన్న పాక్ అభిమానులతో ముచ్చటించాడు. ఈ క్రమంలో ఓ అభిమాని వహాబ్‌కు ఒక అభ్యర్థన చేశాడు.

పాకిస్థాన్ అభిమానులకు ఆసియా కప్ ట్రోఫీ వద్దని, కానీ పాక్ మహిళా జట్టు భారత్‌ను ఓడించాలని విజ్ఞప్తి చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. టీమ్‌ఇండియా ఫ్యాన్స్ కౌంటర్ ఇస్తున్నారు. "వారు (పాక్) క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా ఆడతారు. కానీ రెండు సందర్భాల్లోనూ ఓటమి శాశ్వతం" అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. "మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదనుకుంటా.. ఫైనల్‌కు రండి.. ఈ సారి అంతకు మించిన ట్రీట్ టీమ్‌ఇండియా ఇస్తుంది" అని మరో యూజర్ అన్నాడు.

**ఫైనల్లో భారత్, పాక్?**

ఇప్పటికే భారత్, పాక్ గ్రూప్‌లో దశలో ఒకసారి తలపడ్డాయి. ఈ చిరకాల ప్రత్యర్థులు మరోసారి తలపడే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ రెండు టీమ్‌లు సెమీస్‌కు చేరాయి. అందులో విజయం సాధిస్తే ఫైనల్‌లో భారత్, పాక్ అమీతుమీ తేల్చుకుంటాయి. గ్రూప్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే. మంగళవారం బంగ్లాదేశ్, యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టుతో భారత్ సెమీ ఫైనల్ (సెప్టెంబరు 10న) ఆడుతుంది. ఇక, రెండో సెమీ ఫైనల్‌లో శ్రీలంకతో పాక్ తలపడనుంది. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబరు 13న జరగనుంది.




PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314